సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
హైదరాబాద్
శనివారం, 10.10.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 340
పేజీలు: 08 వెల: రూ. 5

# నవీ పిళ్లైకి నోబెల్ శాంతి పురస్కారం




## ట్రంప్ ఆశలపై నీళ్లు

- ఎనిమిది యుద్ధాలు ఆపానన్న ట్రంప్‌కు షాక్
- భారత సంతతి మహిళకు నోబెల్ శాంతి బహుమతి
- మానవ హక్కుల పోరాటానికి అంతర్జాతీయ గుర్తింపు
- నవీ పిళ్లైకు అరుదైన గౌరవం!

# పేదల కష్టార్జితానికి రక్షణేది?

## జవహర్‌నగర్‌లో ప్రభుత్వ భూముల గోల్‌మాల్? విచారణకు డిమాండ్

- మాజీ సైనికులకు కేటాయించిన భూములపై అసలేం జరిగింది?
- 848, 856, 815, 816 సర్వే నంబర్లపై స్పష్టత ఎప్పుడొస్తుంది?
- నాలుగు నుంచి ఆరు లక్షలు పెట్టి స్థలాలు కొన్న పేదల్లో ఆందోళన
- నోటరీ పత్రాలతో స్థలాల కొనుగోళ్లు.. హక్కులపై సందేహాలు!
- ప్రభుత్వ భూములా.. పట్టా భూములా? తేల్చాల్సిన అధికారులు!
- ప్రభుత్వ భూములకు రక్షణ.. పేదల స్థలాలకు భరోసా కల్పించాలి



**ముద్ర, స్టేట్ బ్యూరో :**
సొంతింటి కలను నెరవేర్చుకునేందుకు జీవితకాల సంపాదనను ధారపోసిన నిరుపేదల భవిష్యత్తు ఇప్పుడు ప్రశ్నార్థకంలో పడింది. ఒకవైపు ప్రభుత్వ భూముల పరిరక్షణ, మరోవైపు మాజీ సైనికులకు గతంలో కేటాయించిన భూముల హక్కులు, ఇంకోవైపు నోటరీ పత్రాల ఆధారంగా స్థలాలు కొనుగోలు చేసి మోసపోయామని గ్రహిస్తున్న పేదల ఆవేదన.. ఈ మూడు అంశాలు ప్రస్తుతం జవహర్‌నగర్, కాప్రా పరిసర ప్రాంతాల్లో తీవ్ర కలకలం రేపుతున్నాయి.

**మాజీ సైనికుల భూములా? అక్రమ విక్రయాలా?**

జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ పరిసర ప్రాంతాల్లోని కొన్ని భూములను గతంలో మాజీ సైనికులకు కేటాయించినట్లు రికార్డులు చెబుతున్నాయి. అయితే ఆ కేటాయింపు భూముల ప్రస్తుత యాజమాన్య పరిస్థితి ఏమిటనే దానిపై స్పష్టత కొరవడింది. కేటాయించిన భూములను సాధారణ పట్టా భూములుగా చూపి, కొంతమంది మధ్యవర్తులు చట్టవిరుద్ధంగా విక్రయాలకు పాల్పడ్డారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భూ కేటాయింపు ఉత్తర్వులు, పట్టాదారుల వివరాలు, రిజిస్ట్రేషన్ పత్రాలు, నిషేధిత భూముల జాబితాలను రెవెన్యూ అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తే తప్ప అసలు వాస్తవాలు వెలుగులోకి రావు. మిగతా 02లో



# తెలంగాణకు కరెంట్ కష్టాలు

## ప్రజలకు రూ.5,420 కోట్ల ట్రూ-అప్ షాక్!

- ఓవైపు విద్యుత్ కొరత
- మరోవైపు అదనపు బిల్లుల భారం
- 19,892 మెగావాట్లకు చేరిన విద్యుత్ డిమాండ్
- రేవంత్ సర్కార్‌కు అగ్నిపరీక్ష

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
తెలంగాణలో విద్యుత్ సంక్షోభం, మరోవైపు ట్రూ-అప్ చార్జీల భారం రాష్ట్ర ప్రభుత్వానికి కొత్త సవాళ్లను విసురుతున్నాయి. మండుతున్న ఎండలు, వర్షాభావ పరిస్థితులు, వ్యవసాయంతో పాటు పారిశ్రామిక రంగంలో పెరిగిన విద్యుత్ అవసరాలు సరఫరా వ్యవస్థపై తీవ్ర ఒత్తిడిని పెంచుతున్నాయి. రాష్ట్రంలో విద్యుత్ గరిష్ఠ డిమాండ్ 19,892 మెగావాట్లకు చేరగా, అక్కడక్కడా అప్రకటిత విద్యుత్ కోతలు, లో-వోల్టేజీ సమస్యలపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇదే సమయంలో రూ.5,420.23 కోట్ల ట్రూ-అప్ చార్జీలను వ్యవసాయేతర వినియోగదారుల నుంచి వసూలు చేయనుండటం కాంగ్రెస్ ప్రభుత్వానికి రాజకీయంగా సవాలుగా మారింది.

**రూ.5,420 కోట్ల భారం ప్రజలపైనే!**

2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన విద్యుత్ కొనుగోళ్లు, అదనపు వ్యయాలు, ఆదాయ లోటుల సర్దుబాటులో భాగంగా తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ) మొత్తం రూ.7,635.22 కోట్ల ట్రూ-అప్ చార్జీల వసూలుకు అనుమతించినట్లు సమాచారం. ఇందులో వ్యవసాయ రంగానికి సంబంధించిన రూ.2,214.99 కోట్ల భారాన్ని ప్రభుత్వం భరించనుండగా, మిగిలిన రూ.5,420.23 కోట్లను వ్యవసాయేతర వినియోగదారుల నుంచి దశలవారీగా వసూలు చేయనున్నారు. ఇప్పటికే ధరల పెరుగుదలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు అదనపు విద్యుత్ బిల్లుల భారం మరింత భారంగా మారే అవకాశం ఉంది.

**విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి**

విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సరఫరాను కొనసాగించేందుకు ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అవసరమైన విద్యుత్‌ను బహిరంగ మార్కెట్ నుంచి కొనుగోలు చేయడంతో పాటు థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరాపై దృష్టి సారిస్తోంది. ఎత్తిపోతల పథకాలకు పీక్ అవర్స్‌కు బదులుగా ఆఫ్-పీక్ సమయాల్లో విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించడం మిగతా 02లో

# ప్రజా ఉద్యమాలకు వేదిక

## జంతర్ మంతర్ కేంద్రంగా ఢిల్లీ రాజకీయాలు

- నిరసనలతో వేడెక్కుతున్న రాజధాని
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు విపక్షాల డిమాండ్..
- కాంగ్రెస్ ఆందోళనల ఉధృతి



**ముద్ర, న్యూఢిల్లీ:**
దేశ రాజధాని ఢిల్లీలో మరోసారి నిరసనల సెగ రాజుకుంటోంది. ప్రజా ఉద్యమాలకు, రాజకీయ పోరాటాలకు చిరునామాగా నిలిచిన జంతర్ మంతర్ మరోసారి దేశ రాజకీయాలకు కేంద్రబిందువుగా మారింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో విపక్షాలు ఆందోళనలను ఉధృతం చేస్తున్నాయి. కాంగ్రెస్ చేపడుతున్న నిరసన కార్యక్రమాలు, పోలీసుల ఆంక్షలు, అరెస్టుల పరిణామాలతో రాజధానిలో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. ఎన్నికల వ్యవస్థపై విశ్వసనీయత, ఎన్నికల సంఘం పనితీరు వంటి అంశాలను కేంద్రంగా చేసుకుని విపక్షాలు తమ గళాన్ని వినిపిస్తున్నాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వైఖరిపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న విపక్ష నేతలు ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశంపై రాజకీయ పోరాటాన్ని మరింత విస్తరించేందుకు ఆందోళనలకు సిద్ధమవుతున్నారు. మిగతా 02లో

# సర్వీసు రికార్డులన్నీ డిజిటల్

## సర్కార్ మరో సంచలన నిర్ణయం




- 93 శాతం ఉద్యోగుల డేటా డిజిటలైజేషన్ పూర్తి
- ప్రతి నెలా 1వ తేదీనే జీతాలు జమయ్యేలా చర్యలు
- పేపర్‌లెస్ పాలన దిశగా సర్కార్ కీలక అడుగు

# ఢిల్లీలో లాక్ డౌన్?

## న్యూఢిల్లీలో ఇంటర్నెట్ సేవల నిలిపివేత..




- కేంద్ర హోంశాఖ కీలక ఉత్తర్వులు
- హోటళ్లు, షెల్టర్లలో తనిఖీలు
- పలు రైళ్ల రాకపోకలు బంద్

# ఏపీలో ఎన్నికలకు లైన్ క్లియర్

## వైసీపీ పిటిషన్ కొట్టివేత

- ఎస్ఐఆర్ పూర్తయ్యే వరకు వేచి ఉండాలన్న వాదనకు అంగీకరించని సుప్రీం కోర్టు
- పాత లేదా తాజా ఓటర్ల జాబితాతో ఎన్నికలు నిర్వహించుకోవచ్చని స్పష్టీకరణ
- వార్డుల పునర్విభజనతో ఎన్నికలు ఆలస్యం చేయొద్దు




# ఎల్‌నినో గండం

## 235 మండలాల్లో కరువు ఛాయలు!

- రైతులకు భరోసా.. 12న సీఎం రేవంత్ కీలక భేటీ!
- వర్షాభావంపై ఫోకస్.. రూ.20 వేల కోట్ల ప్యాకేజీ కోసం విజ్ఞప్తి!
- తగ్గిన వర్షాలు.. సాగు, తాగునీటిపై ప్రభుత్వ సమీక్ష!
- కరువు కష్టాలపై కార్యాచరణ..
- మంత్రులతో సీఎం రేవంత్ సమావేశం!




# తమిళనాడులో సీఎంకు బూస్ట్

## రెండు ఉప ఎన్నికల్లోనూ టీవీకే ఘన విజయం!

- మధురాంతకంలో మరగతం కుమరవేల్ 17,554 ఓట్ల మెజారిటీతో విజయం
- ధారాపురంలో 10,196 ఓట్ల మెజారిటీతో గెలిచిన సత్యభామ
- అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేసి టీవీకేలో చేరడంతో అనివార్యమైన ఉపఎన్నికలు
- 4 నెలలుగా చేసిన పనులకు ప్రజలు ఇచ్చిన మద్దతుగా టీవీకే నేతల అభివర్ణన




## ఇదీ AI ముద్ర

నోబెల్ నాకే రావాలి.. మరొకరికి ఎలా ఇస్తారు.. ట్రంప్ ఫస్ట్రేషన్ పీక్స్



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in | @mudranews

శనివారం,
10 అక్టోబర్, 2026



**ఉప్పు, నూనె, పంచదార తగ్గింపు**
ఆహారంలో ఉప్పు, నూనె మరియు పంచదార మోతాదును తగ్గించడం వల్ల గుండె జబ్బులు మరియు బీపీ నియంత్రణలో ఉంటాయి.




# నవీ పిళ్లైకి నోబెల్ శాంతి పురస్కారం



**ముద్ర, న్యూఢిల్లీ :**
ఎనిమిది యుద్ధాలను ఆపానని, నోబెల్ శాంతి బహుమతికి అర్హుడిని తానేనని పదేపదే చెప్పుకున్న అమెరికా అధ్యక్షు డు డొనాల్డ్ ట్రంప్‌కు తీవ్ర నిరాశ ఎదురైంది. నార్వేజియన్ నోబెల్ కమిటీ ప్రకటించిన 2026 సంవత్సరపు నోబెల్ శాంతి పురస్కారం ఆయనను కాకుండా, భారత సంతతికి చెందిన ప్రఖ్యాత దక్షిణాఫ్రికా న్యాయవేత్త, మానవ హక్కుల పోరాట యోధురాలు నవనీతం 'నవీ' పిళ్లైని వరించింది. ప్రపంచవ్యాప్తంగా శాంతి పరిరక్షణకు, అంతర్జాతీ య చట్టాల వ్యాప్తికి, నిరుపేదలు , అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె జీవి తాంతం చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఈ అత్యున్నత పురస్కారాన్ని అందిస్తున్నట్లు నోబెల్ కమిటీ అధికారికంగా ప్రకటించింది.

**వర్ణవివక్షపై పోరాటం నుంచి హార్వర్డ్ వరకు..**
నవీ పిళ్లై ప్రయాణం ఎంతో స్ఫూర్తిదాయకమైనది. దక్షిణాఫ్రికాలోని డర్బన్ నగరంలో భారతీయ తమిళ మూలాలు న్న కుటుంబంలో జన్మించిన ఆమె, వర్ణవివక్షకు వ్యతిరేకంగా పోరాడిన కార్యకర్తలకు ఉచితంగా న్యాయ సహాయం అందించారు. అనేక బెదిరింపులను త ట్టుకుంటూ 1967లోనే సొంతంగా ఒక న్యాయ సంస్థను స్థాపించి అణగారిన ప్రజల గొంతుకగా నిలిచారు. అనంతరం అమెరికాలోని ప్రఖ్యాత హార్వర్డ్ విశ్వవిద్యాలయం నుంచి డాక్టర్ ఆఫ్ జ్యూరిడికల్ సైన్స్ డిగ్రీ సాధించారు. 1995లో దక్షిణాఫ్రికా హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులై, ఆ దేశ న్యాయవ్యవస్థలో అత్యున్నత పదవిని అధిరోహించిన మొదటి శ్వేతజాతీయేతర మహిళా జడ్జీగా చరిత్ర సృష్టించారు.

**అంతర్జాతీయ న్యాయపీఠంపై చెరగని ముద్ర**
1999లో అంతర్జాతీయ క్రిమినల్ ట్రిబ్యునల్ ఫర్ రువాండా (ICTR) అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన నవీ పిళ్లై, అక్కడి మారణహోమానికి సంబంధించిన కేసులను నిష్పక్షపాతంగా విచారించారు. యుద్ధంలో మహిళలపై జరి గే లైంగిక హింస, అత్యాచారాలను కేవ లం నేరాలుగా కాక, మానవాళికి వ్యతిరేకంగా జరిగిన తీవ్రమైన మారణహోమ ఆధారాలుగా పరిగణించాలం టూ ఆమె ఇచ్చిన తీర్పులు అంతర్జాతీయ న్యాయ సూత్రాలను తిరగరాశాయి. ఆ తర్వాత అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ICC) న్యాయమూర్తిగా, 2008 నుంచి 2014 వరకు ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల హైకమిషనర్‌గా సేవలు అందించి ప్రపంచవ్యాప్తంగా జరిగే హక్కుల ఉల్లంఘనలను నిర్భయంగా ప్రశ్నించారు.

**పాలస్తీనా, మయన్మార్ సంక్షోభాల్లో కీలక పాత్ర**
ఆక్రమిత పాలస్తీనా భూభాగాల్లో మానవ హక్కుల ఉల్లంఘనలపై ఏర్పాటైన ఐరాస విచారణ కమిషన్ అధ్యక్షురాలిగా, మయన్మార్‌లో రోహింగ్యా ముస్లింలపై జరిగిన మారణహోమ విచారణలో అంతర్జాతీయ న్యాయస్థానం (ICJ) తాత్కాలిక న్యాయమూర్తిగా ఆమె కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఆమెకు నోబెల్ శాంతి బహుమతి దక్కడం పట్ల ఐక్యరాజ్యసమితి మా నవ హక్కుల కార్యాలయం హర్షం వ్యక్తం చేసింది. విజేతగా నిలిచిన నవీ పిళ్లైకు 1.2 కోట్ల స్వీడిష్ క్రోనాలు (సుమారు 12 లక్షల అమెరికన్ డాలర్లు) నగదు బహుమతి అందనుంది. ఆల్ఫ్రెడ్ నోబెల్ వర్ధంతిని పురస్కరించుకుని డిసెంబర్ 10న నార్వే రాజధాని ఓస్లోలో ఈ పురస్కారాన్ని ప్రధానం చేయనున్నారు.




# పేదల కష్టార్జితానికి రక్షణ ఏది?

**(మొదటి పేజీ తరువాయి)**
**విస్తీర్ణంలో వ్యత్యాసాలు..**
**10 ఎకరాల భూమి లెక్కల్లో తేడాలు?**
రెవెన్యూ రికార్డుల్లో నమోదైన విస్తీర్ణానికి, క్షేత్రస్థాయిలో ఆక్రమణలో ఉన్న భూమికి పొంతన ఉండటం లేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దాదాపు 10 ఎకరాల వరకు ఉన్న భూమిలో సరిహద్దులు మార్చి.. అదనపు భూమిని ఆధీనంలోకి తీసుకున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పాత రెవెన్యూ రికార్డులను ప్రస్తుత వివరాలతో సరిపోల్చి సమగ్ర భూ సర్వే నిర్వహించాలని స్థానికులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.




**నోటరీ పత్రాలతో కొనుగోళ్లు..**
**పేదల ఆశలతో చెలగాటం**
గబ్బిలాలపేట, చెన్నాపురం తదితర ప్రాంతాల్లో రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేదలు 60 నుంచి 70 చదరపు గజాల స్థలాలను రూ. 4 లక్షల నుంచి రూ. 6 లక్షల వరకు వెచ్చించి కొనుగోలు చేశారు. వీరిలో మెజారిటీ లావాదేవీలు కేవలం నోటరీ పత్రాల ఆధారంగానే జరిగాయి. చట్టప్రకారం నోటరీ పత్రం భూమిపై ఎటువంటి యాజమాన్య హక్కును కల్పించదు. విద్యుత్ మీటర్, కుళాయి కనెక్షన్ పొందడం లేదా ఇల్లు నిర్మించుకోవడం అనేది చట్టబద్ధమైన యాజమాన్యానికి నిదర్శనం కాదనే విషయాన్ని కొనుగోలుదారులు గ్రహించాల్సి ఉంది. యాజమాన్య హక్కులపై స్పష్టత లేకపోవడంతో, తాము ఎక్కడ ఇల్లు కోల్పోతామో.. కష్టపడి కూడబెట్టిన సొమ్ము బూడిదలో పోసిన పన్నీరవుతుందోనని పేద కుటుంబాలు తీవ్ర భయాందోళనలో ఉన్నాయి.

**848, 856, 815, 816 సర్వే నం.పై స్పష్టత ఏది?**
ఈ వ్యవహారమై కాప్రా తహసీల్దార్‌ను సంప్రదించగా, 848, 856, 815, 816 సర్వే నంబర్ల ఉన్న భూములపై వివాదాలు ఉన్నాయని.. ప్రభుత్వానివా, మాజీ సైనికులవా లేదా ప్రైవేట్ పట్టా భూములా అనే విషయంపై విచారణ జరిపి నిగ్గుతేల్చాలని చెప్పారు.. భూ వర్గీకరణ, యాజమాన్య మార్పిడిపై రెవెన్యూ శాఖ అధికారులు స్పష్టమైన రికార్డులను పరిశీలించి శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని బాధితులు కోరుతున్నారు.

**పర్యావరణ, ప్రజారోగ్య సమస్యల ముప్పు**
ఒకవైపు భూ చిక్కులు వేధిస్తుంటే, మరోవైపు జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ సమీపంలో నివాసముంటున్న ప్రజలు తీవ్ర పర్యావరణ, ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. దుర్వాసన, గాలి కాలుష్యం, భూగర్భ జలాలు కలుషితం కావడం వల్ల స్థానికులలో దగ్గు, ఆయాసం, చర్మ వ్యాధులు వ్యాపిస్తున్నాయి. పర్యావరణ, వైద్య, మున్సిపల్ శాఖలు సంయుక్తంగా తనిఖీలు చేపట్టి ప్రజారోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

**ప్రభుత్వం తక్షణమే స్పందించాలి**
ప్రభుత్వ భూములను కాపాడటం ఎంత ముఖ్యమో, మధ్యవర్తుల మాయమాటలు నమ్మి మోసపోయిన నిరుపేదల ప్రయోజనాలను కాపాడటం కూడా అంతే ముఖ్యం. 848, 856, 815, 816 సర్వే నంబర్లపై ఉన్నతాధికారులతో సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా, పేదల కష్టార్జితానికి భరోసా కల్పించాలని బాధిత ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# ప్రజా ఉద్యమాలకు వేదిక

**(మొదటి పేజీ తరువాయి)**
**నిరసనలకు కేరాఫ్‌గా జంతర్ మంతర్**
ఢిల్లీ నడిబొడ్డున ఉన్న జంతర్ మంతర్ ఎన్నో దశాబ్దాలుగా ప్రజా ఉద్యమాలకు వేదికగా నిలుస్తోంది. ప్రభుత్వ విధానాలపై నిరసనలు, వివిధ వర్గాల హక్కుల కోసం పోరాటాలు, రాజకీయ పార్టీల ఆందోళనలు ఇక్కడి నుంచి దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి. ఇప్పుడు ఎన్నికల సంఘానికి సంబంధించిన వివాదం నేపథ్యంలో మరోసారి ఈ ప్రాంతం రాజకీయ కార్యకలాపాలతో ప్రాధాన్యం సంతరించుకుంది. విపక్షాల నిరసనలతో పాటు వివిధ రాజకీయ శక్తుల ఆందోళన కార్యక్రమాలు రాజధానిలో ఉద్రిక్తతను పెంచుతున్నాయి. నిరసనకారులను నియంత్రించేందుకు పోలీసులు చేపడుతున్న చర్యలు, విధిస్తున్న ఆంక్షలు కూడా రాజకీయ చర్చకు దారితీస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు, శాంతిభద్రతల పరిరక్షణ మధ్య సమతుల్యతపై చర్చ సాగుతోంది.

**భారీ నిరసనలకు పిలుపుతో మరింత ఉత్కంఠ**
ఇదే సమయంలో ఈ నెల 10న భారీ నిరసనకు పిలుపు రావడం ఢిల్లీ రాజకీయాల్లో మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ కార్యక్రమంలో పాల్గొనే వారి సంఖ్య, పోలీసుల అనుమతులు, భద్రతా ఏర్పాట్లు వంటి అంశాలు ప్రాధాన్యం సంతరించుకోనున్నాయి. ఇప్పటికే నిరసనలు, అరెస్టుల నేపథ్యంలో ఉద్రిక్తంగా ఉన్న రాజధానిలో తదుపరి పరిణామాలపై రాజకీయ వర్గాలు దృష్టి సారిస్తున్నాయి. మొత్తంగా జంతర్ మంతర్ మరోసారి అధికార, విపక్షాల మధ్య రాజకీయ పోరాటానికి ప్రధాన వేదికగా మారింది. సీఈసీ రాజీనామా డిమాండ్‌పై విపక్షాలు ఎంతవరకు ఉద్యమాన్ని విస్తరిస్తాయి? పోలీసుల ఆంక్షలు, అరెస్టులపై ఎలాంటి స్పందన వస్తుంది? ఈ నిరసనలు జాతీయ రాజకీయాల్లో ఎలాంటి చర్చకు దారితీస్తాయి? అన్నది ఆసక్తికరంగా మారింది.

# ఎల్‌నినో గండం




**ముద్ర, డెస్క్:**
రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో దృష్టి సారించారు. రాష్ట్రంలో నెలకొన్న ప్రతికూల పరిస్థితులపై చర్చించేందుకు ఈనెల 12న మంత్రులతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సాధారణం కంటే 17 శాతం తక్కువ వర్షపాతం నమోదు కావడం, దాదాపు 235 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. ఈ సమావేశంలో ప్రధానంగా వర్షపాతం తగ్గడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతాంగానికి అండగా నిలిచేందుకు చేపట్టాల్సిన తక్షణ సహాయక చర్యలపై సీఎం సమీక్షించనున్నారు.

**కీలక అంశాలపై సమీక్ష..**
సమావేశంలో ప్రాథమికంగా వ్యవసాయం, సాగునీటి ప్రాజెక్టుల లో నీటి లభ్యత, తాగునీటి సరఫరా, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పెరిగిన విద్యుత్ డిమాండ్ తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించనున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలోనూ కరువు పరిస్థితులపై లోతుగా చర్చించిన సంగతి తెలిసిందే.

**రూ. 20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ..**
రాష్ట్రంలోని కరువు మండలాలను అధికారికంగా ప్రకటించడంతో పాటు, బాధిత రైతులకు తగినంత ఆర్థిక సాయం అందించేలా చర్యలు తీసుకోవాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వర్షాభావ పరిస్థితులను తట్టుకునేందుకు రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీని కేటాయించాలని కూడా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. ఈ నెల 12న జరగబోయే సమావేశంలో.. ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘం రూపొందించిన ప్రణాళికలు, వర్షాభావ ప్రాంతాల్లో చేపట్టాల్సిన ఉపశమన చర్యలు, త్వరలో నిర్వహించబోయే అఖిలపక్ష సమావేశం, రైతు సంఘాలు, వివిధ రంగాల నిపుణుల నుంచి స్వీకరించే సలహాలు, సూచనలపై సమగ్ర కా ర్యాచరణను ఖరారు చేసే అవకాశముంది.

# తెలంగాణకు కరెంట్ కష్టాలు

**(మొదటి పేజీ తరువాయి)**
నగరాల్లో సబ్‌స్టేషన్ల సామర్థ్యాన్ని పెంచడం, గ్రిడ్ నిర్వహణను మెరుగుపరచడం వంటి చర్యలను అమలు చేయాలని భావిస్తోంది.



**బీఆర్ఎస్ విమర్శలు.. కాంగ్రెస్ ఎదురుదాడి**
విద్యుత్ సమస్యలను అస్త్రంగా చేసుకుని ప్రతిపక్ష బీఆర్ఎస్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తోంది. విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని ఆరోపిస్తోంది. దీనికి కాంగ్రెస్ ప్రభుత్వం స్పందిస్తూ గత ప్రభుత్వంలో పేరుకుపోయిన డిస్కంల బకాయిలు, ఆర్థిక సమస్యలే ప్రస్తుత పరిస్థితికి కారణమని వివరిస్తోంది. గత ప్రభుత్వాలపై విమర్శలు చేయడం కంటే ప్రస్తుత సమస్యలకు పరిష్కారం చూపించడమే ముఖ్యమని ప్రజలు భావిస్తున్నారు.

**గ్రీన్ ఎనర్జీతో శాశ్వత పరిష్కారం సాధ్యమేనా?**
దీర్ఘకాలికంగా విద్యుత్ కొరతను అధిగమించేందుకు యాదాద్రి థర్మల్ పవ ర్ ప్లాంట్ మిగిలిన యూనిట్ల పనుల ను వేగవంతం చేయడం, సౌర విద్యు త్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులను ప్రోత్సహించడం వంటి చర్యలపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. వ్యవసాయ విద్యుత్ కు సంబంధించిన బకాయిలను డిస్కం లకు సకాలంలో చెల్లించడం ద్వారా పంపిణీ సంస్థల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచాలని భావిస్తోంది.

**ప్రజాగ్రహాన్ని తప్పించుకోగలదా?**
ఒకవైపు నిరంతరాయ విద్యుత్ సరఫరా కల్పించాల్సిన బాధ్యత, మరోవైపు వేల కోట్ల రూపాయల ట్రూ–అప్ చార్జీ లను ప్రజలపై మోపాల్సిన పరిస్థితి.. ఈ రెండింటి మధ్య రేవంత్ ప్రభుత్వం ఇబ్బందికరమైన పరీక్షను ఎదుర్కొంటోంది. విద్యుత్ బిల్లుల భారం వినియోగదారుల్లో అసంతృప్తిని పెంచే అవకాశం ఉండగా, కోతలు కొనసాగితే ప్రజాగ్రహం పెరిగే ప్రమాదం ఉంది. పండుగలు, వ్యవసాయ సీజన్లలో విద్యుత్ సరఫరాను మెరుగుపరచడంతో పాటు అదనపు చార్జీల విషయంలో ప్రజలకు స్ప ష్టతివ్వగలిగితేనే ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోగలదు. లేకుంటే విద్యుత్ కష్టాలు, ట్రూ–అప్ భారం కాంగ్రెస్ సర్కార్‌కు పెద్ద తలనొప్పిగా మారే అవకాశం ఉంది.

# ఏపీలో స్థానిక ఎన్నికలకు లైన్ క్లియర్

**ముద్ర, అమరావతి :**
ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమమైంది. ఎన్నికలను వాయిదా వేయాలని కోరుతూ వైసీపీ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఓటర్ల జాబితా, వార్డుల పునర్విభజన అంశాలపై కీలక స్పష్టత ఇచ్చింది. దీంతో రాష్ట్రంలో స్థానిక ఎన్నికల నిర్వహణపై ఉత్కంఠకు తెరపడినట్లయింది. ఓటర్ల జాబితాపై విచారణ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికలు నిర్వహించకూడదన్న వైసీపీ వాదనను ధర్మాసనం అంగీకరించలేదు. ఎస్ఐఆర్ తాజా జాబితా సిద్ధమైనా, పాత ఓటర్ల జాబితాతోనైనా ఎన్నికలు నిర్వహించుకోవచ్చని స్పష్టం చేసినట్లు సమాచారం. వార్డుల పునర్విభజన అంశంపైనా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఇప్పటికిప్పుడు వార్డుల పునర్విభజన చేపట్టాలని కోరడం ఎన్నికలను ఆలస్యం చేసే ప్రయత్నమేనన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. దీంతో ఎన్నికల నిర్వహణకు సంబంధించి అడ్డంకులు తొలగినట్లయింది.

# ఉద్యోగుల సర్వీసు రికార్డులన్నీ డిజిటల్

**ముద్ర, హైదరాబాద్:**
తెలంగాణ ప్రభుత్వం పాలనలో పారదర్శకతను పెంచడం కోసం పరిపాలనా విధానాలు, అనుమతులు, ఉద్యోగుల సర్వీసులు బిల్లుల చెల్లింపులను పూర్తిగా డిజిటలైజ్ చేయాలని నిర్ణయించింది. ఉద్యోగుల వివరాల డిజిటలైజేషన్ చేసే క్రమంలో Human Resource Management System (e-HRMS)ను ప్రవేశపెట్టారు. ప్రభుత్వ ఉద్యోగుల పూర్తి వివరాలు, సర్వీసు రికార్డులను పారదర్శకంగా ఉంచేందుకు e-HRMS విధానాన్ని 100% డిజిటలైజ్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దాదాపు 93% మంది డేటా డిజిటలైజేషన్ పూర్తయింది.

**తెలంగాణ IFMIS పోర్టల్..**
రెగ్యులర్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది బ్యాంక్ ఖాతాలు, జీతాల వివరాలను కూడా డిజిటలైజ్ చేస్తున్నారు. దీనివల్ల ఏజెన్సీల ప్రమేయం తగ్గి, ప్రతినెలా ఒకటో తేదీనే నేరుగా వారి ఖాతాల్లో జీతాలు జమ అయ్యేలా పారదర్శకత పెరుగుతుంది. తెలంగాణ IFMIS పోర్టల్ ద్వారా ప్రభుత్వ బిల్లుల చెల్లింపుల ప్రక్రియను పూర్తిగా పేపర్‌లెస్ డిజిటల్ విధానంలోకి మార్చారు. అభివృద్ధి పనుల మంజూరీ,Technical Sanctions, కాంట్రాక్టుల కేటాయింపుల్లో ఎలాంటి అవకతవకలు, పక్షపాతానికి తావులేకుండా ఉండేందుకు మొత్తం టెండర్ ప్రక్రియను ఒకే డిజిటల్ గొడుగు కిందికి తీసుకువచ్చేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

**అధికారిక కమిటీ ఏర్పాటు..**
రాష్ట్రంలో డిజిటల్ పరిపాలనను అమలు చేయడం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక అధికారిక కమిటీని ఏర్పాటు చేశారు. దీన్నిOfficial Committee on Digital Governanceగా పిలుస్తున్నారు. ఈ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా రాబోయే రోజుల్లో సచివాలయం నుండి క్షేత్రస్థాయి కార్యాలయాల వరకు అన్ని రకాల అనుమతులు, ఫైళ్ల కదలికలు పూర్తిగా ఆన్‌లైన్ రూపాన్ని సంతరించుకోనున్నాయి. ప్రజా పాలన పూర్తిగా పారదర్శకంగా ఉందనే విధంగా, అవినీతికి ఆస్కారమే లేకుండా చేయలనే లక్ష్యంతో సీఎం ఈ విధానానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్టుగా ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.

# తమిళనాడులో సీఎం విజయ్‌కు బూస్ట్

**ముద్ర, చెన్నై:**
తమిళనాడు సీఎం విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీకి ఉప ఎన్నికల్లో భారీ విజయం దక్కింది. మధురాంతకం, ధారాపురం అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లోనూ ఆ పార్టీ అభ్యర్థులు గెలుపొందారు. రెండు స్థానాల్లోనూ ప్రధాన ప్రత్యర్థి డీఎంకే రెండో స్థానానికే పరిమితమైంది. ఈ ఫలితాలు విజయ్ ప్రభుత్వానికి రాజకీయంగా మరింత బలాన్ని ఇచ్చాయి. మధురాంతకం నియోజకవర్గంలో టీవీకే అభ్యర్థి మరగతం కుమరవేల్ 17,554 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఆమెకు 61,470 ఓట్లు రాగా, డీఎంకే అభ్యర్థి పరంధామన్‌కు 43,916 ఓట్లు వచ్చాయి. అన్నాడీఎంకే అభ్యర్థి గణితసంపత్ 38,770 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. ఈ నియోజకవర్గంలో మొత్తం 27 మంది పోటీ చేయగా, 86.26 శాతం పోలింగ్ నమోదైంది. ధారాపురంలోనూ టీవీకే అభ్యర్థి సత్యభామ విజయకేతనం ఎగురవేశారు. ఆమెకు 62,596 ఓట్లు రాగా, డీఎంకే అభ్యర్థి సుకన్యకు 52,400 ఓట్లు వచ్చాయి. దీంతో సత్యభామ 10,196 ఓట్ల మెజారిటీతో గెలిచారు. అన్నాడీఎంకే అభ్యర్థి భానుమతి 41,078 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. ఇక్కడ 22 మంది అభ్యర్థులు పోటీ చేయగా, 80.30 శాతం ఓటింగ్ నమోదైంది.

ఈ రెండు స్థానాలకు ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి. గతంలో అన్నాడీఎంకే తరఫున గెలిచిన ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేసి టీవీకేలో చేరారు. దీంతో ఖాళీ అయిన స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. టీవీకే, డీఎంకే, అన్నాడీఎంకేతో పాటు వామపక్షాలు, నామ్ తమిళర్ కట్చి కూడా పోటీలో నిలిచాయి. ఈ విజయాలు తమ ప్రభుత్వం నాలుగు నెలలుగా చేసిన పనులకు ప్రజలు ఇచ్చిన మద్దతుగా టీవీకే నేతలు అభివర్ణించారు. ఎన్నికల ప్రచారంలో హోరాహోరీ పోటీ నెలకొన్న నేపథ్యంలో రెండు స్థానాలనూ గెలుచుకోవడం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. మరోవైపు, రెండు చోట్లా ఓటమి పాలైన డీఎంకే, అన్నాడీఎంకే తమ ఫలితాలను సమీక్షించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# సీజేపీ దెబ్బకు ఢిల్లీలో లాక్ డౌన్?

**ముద్ర, న్యూఢిల్లీ :**
దేశ రాజధాని న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద అక్టోబర్ 10 న నేడు సీజేపీ నిరసనలకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. దీంతో మొబైల్ ఇంటర్నెట్ సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తూ కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. శాంతిభద్రతల పరిరక్షణ, అవాంఛనీయ ఘటనల నివారణ చర్యల్లో భాగంగా జనపథ్–కర్తవ్యపథ్ క్రాసింగ్ పరిసర ప్రాంతాల్లో దాదాపు 4 కిలోమీటర్ల వ్యాసార్థం (రేడియస్) పరిధిలో ఇంటర్నెట్ సేవలను నిలిపివేసేందుకు హోం శాఖ అధికారిక ఆమోదం తెలిపింది. ఈ తాత్కాలిక ఆంక్షలు అక్టోబర్ 9 రాత్రి 10 గంటల నుండి ప్రారంభమై, అక్టోబర్ 10 రాత్రి 10 గంటల వరకు వరుసగా 24 గంటల పాటు పూర్తి స్థాయిలో అమల్లో ఉంటాయని అధికారులు స్పష్టం చేశారు.



ఈ ఉత్తర్వుల ప్రకారం నిర్దేశిత ప్రాంత పరిధిలో అన్ని రకాల మొబైల్ ఇంటర్నెట్ సేవలు, బ్రాడ్‌బ్యాండ్ సంబంధిత సాంకేతిక పరిజ్ఞాన సేవలను తాత్కాలికంగా నిలిపివేయాలని సంబంధిత టెలికాం ఆపరేటర్లు, సర్వీస్ ప్రొవైడర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. నిరసనలు, ఇతర సున్నితమైన భద్రతా కారణాల దృష్ట్యా పుకార్లు, తప్పుడు సమాచారం వేగంగా వ్యాపించకుండా నియంత్రించేందుకే ఈ ముందస్తు చర్యలు చేపట్టినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. దేశ రాజధాని నడిబొడ్డున వీవీఐపీ కదలికలు అధికంగా ఉండే అత్యంత సున్నితమైన ప్రాంతంలో 24 గంటల పాటు నెట్ సేవలు నిలిచిపోనుండటంతో భద్రతా బలగాలు గట్టి నిఘా ఏర్పాటు చేశాయి.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శనివారం 10.10.2026
www.mudranews.in | @mudranews



### జ్వరం ఉంటే పారాసిటమాల్ వాడకం.. వైద్యుని సలహా

శరీర ఉష్ణోగ్రత ఒళ్ళు నొప్పులు తగ్గడానికి వైద్యుల సలహా మేరకు మాత్రమే పారాసిటమాల్ వాడాలి. సొంత వైద్యంతో యాంటీబయోటిక్స్ అస్సలు వాడకూడదు, ఎందుకంటే యాంటీబయోటిక్స్ వైరల్ ఇన్ఫెక్షన్లపై పనిచేయవు.



## రాహుల్ గాంధీ నాయకత్వంలో ఓటు హక్కు పరిరక్షణకు పోరాటం

**- ఎన్నికల సంఘం తీరుపై విమర్శలు.. - ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్**



**ముద్ర, హైదరాబాద్:** భారతదేశంలో ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి ప్రజల నుంచి మద్దతు పెరుగుతోందని ఏపీసీసీ మాజీ కార్యదర్శి ఎం. రజియుద్దీన్ అహ్మద్ పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వ అవినీతి విధానాలకు వ్యతిరేకంగా, ఎన్నికల సంఘం వ్యవహారశైలిపై రాహుల్ గాంధీ పోరాటం కొనసాగిస్తున్నారని తెలిపారు. ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వ్యవహారశైలి, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో ప్రజల్లో ఆందోళన నెలకొందని తన ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై తన అభ్యంతరాలను వ్యక్తం చేస్తోందని తెలిపారు. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి వంటి నాయకుల పోరాటంతో ప్రజల హక్కులు, భద్రత, సంక్షేమం పరిరక్షించబడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## మంత్రి ఉత్తమ్ ని కలిసిన నేరేడుచర్ల మార్కెట్ కమిటీ పాలకవర్గం



**ముద్ర, నేరేడుచర్ల:** నూతనంగా నియమితులైన నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ చలసాని స్పందన రాజీవ్, వైస్ చైర్మన్ మునగాల భాస్కర్ రెడ్డి, మార్కెట్ కమిటీ సభ్యులు రాష్ట్ర నీటిపారుదల, ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

## బీసీలకు పార్టీ పరంగా 34 శాతం సీట్లు: చంద్రబాబు

**ముద్ర, అమరావతి:** సుప్రీంకోర్టు బీసీ రిజర్వేషన్ల అమలు జీవోను కొట్టివేసిన నేపథ్యంలో, పార్టీ పరంగా బీసీలకు 34 శాతం సీట్లు కేటాయించి న్యాయం చేస్తామని ఏపీ సీఎం చంద్రబాబు ప్రకటించారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో బీసీలను అభివృద్ధి చేసింది టీడీపీనేనని అన్నారు. గత ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించడంతో పలువురు అవకాశాలు కోల్పోయారని విమర్శించారు. బీసీలకు రిజర్వేషన్లు దక్కకుండా కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకున్నారని ప్రతిపక్షంపై ఆరోపణలు చేశారు. స్థానిక ఎన్నికలను అడ్డుకునేందుకు కూడా ప్రయత్నించారని విమర్శించారు. వెనుకబడిన వర్గాలకు న్యాయం చేయడమే తమ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు.

## బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి

**ముద్ర, హైదరాబాద్**: రాష్ట్రంలోని ఆడబిడ్డలందరికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఎంగిలిపూల బతుకమ్మ నుంచి సద్దుల బతుకమ్మ వరకు తొమ్మిది రోజులపాటు మహిళలందరూ ఆటపాటలతో పండుగను వైభవంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. బతుకమ్మ తెలంగాణ ఆత్మగౌరవానికి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రకృతిని ఆరాధించడం, మహిళల ఐక్యత, సామూహిక జీవన విధానానికి ఈ పండుగ నిదర్శనమన్నారు. బతుకమ్మ సంబురాలు ప్రతి ఇంటా ఆనందాన్ని నింపాలని, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో వేడుకలు జరుపుకోవాలని సీఎం ఆకాంక్షించారు.

## యాంటీ డోపింగ్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం

**- యాంటీ డోపింగ్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం**
**- క్రీడల్లో పారదర్శకత, నైతిక విలువలు, నిష్పక్షపాత పోటీలు అత్యంత కీలకం**
**– SATG వైస్ చైర్పర్సన్, ఎండీ డాక్టర్ ఎ. సోనిబాలా దేవి**



**ముద్ర, హైదరాబాద్** : తెలంగాణలో క్రీడారంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు, క్రీడాకారులు, కోచ్‌లు, సాంకేతిక సిబ్బందికి యాంటీ డోపింగ్ నిబంధనలపై అవగాహన కల్పించే లక్ష్యంతో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ , నేషనల్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ సహకారంతో శుక్రవారం గచ్చిబౌలి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో యాంటీ డోపింగ్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. తెలంగాణలో జరగనున్న ప్రతిష్టాత్మక ఖేలో ఇండియా యూత్ గేమ్స్–2026, నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్ తదితర ప్రధాన క్రీడా పోటీల నేపథ్యంలో క్రీడా సిబ్బందిని అన్ని విధాలుగా సన్నద్ధం చేయడంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ యాంటీ డోపింగ్ ఏజెన్సీకు చెందిన లీడ్ డోపింగ్ కంట్రోల్ ఆఫీసర్, యాంటీ డోపింగ్ ఎడ్యుకేటర్ డాక్టర్ నేహా సింగ్ పాల్గొని యాంటీ డోపింగ్ నిబంధనలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు రవీందర్, శిరీష, స్టేడియం అడ్మినిస్ట్రేటర్లు రాజ్‌వీర్, రవికుమార్, స్వర్ణలత, సురేష్ కాలేరు తదితరులతో పాటు కోచ్‌లు, ఫిజికల్ డైరెక్టర్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు (PETలు), ఫిజియోథెరపిస్టులు, ఇతర క్రీడా సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా SATG వైస్ చైర్పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎ. సోనిబాలా దేవి మాట్లాడుతూ, తెలంగాణలో క్రీడారంగాన్ని మరింత పటిష్టం చేయడంతో పాటు, క్రీడల్లో నైతిక విలువలను పెంపొందించేందుకు SATG నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. క్రీడాకారులు, కోచ్‌లు, సాంకేతిక నిపుణులకు అవసరమైన అవగాహన, నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా స్వచ్ఛమైన, నిష్పక్షపాత క్రీడా సంస్కృతిని ప్రోత్సహించడమే సంస్థ లక్ష్యమని పేర్కొన్నారు.

ఇలాంటి అవగాహన కార్యక్రమాలు కోచ్‌లు, సాంకేతిక అధికారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, శారీరక విద్యా బోధకులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు దోహదపడతాయని ఆమె తెలిపారు. రాష్ట్రంలో బలమైన, నైతిక విలువలతో కూడిన క్రీడా సంస్కృతిని నిర్మించేందుకు ఈ కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. రానున్న ప్రధాన క్రీడా పోటీలను వృత్తిపరమైన ప్రమాణాలతో, పూర్తి పారదర్శకతతో, నిర్దేశిత క్రీడా నియమ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు SATG కట్టుబడి ఉందని సంస్థ స్పష్టం చేసింది

# ఏడాదిన్నరలో సమగ్ర భూ సర్వే పూర్తి

**భూ వివాద రహిత తెలంగాణే లక్ష్యం: మంత్రి పొంగులేటి**



**ముద్ర, తెలంగాణ బ్యూరో:** రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా చేపట్టిన సమగ్ర భూ రీ–సర్వేను ఏడాదిన్నరలో పూర్తి చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం సచివాలయంలో సర్వే పురోగతిపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించిన ఆయన.. సర్వేలో నాణ్యత, పారదర్శకత, వేగానికి ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సుమారు 125 ఏళ్ల తర్వాత రాష్ట్రంలో సమగ్ర భూ సర్వే చేపట్టామని పేర్కొన్నారు.

రీ–సర్వే పర్యవేక్షణ కోసం రాష్ట్రంలోని ఏడు జోన్లకు రెవెన్యూ, సర్వే విభాగాల నుంచి ఇద్దరు చొప్పున మొత్తం 14 మంది అధికారులను నియమించినట్లు తెలిపారు. తొలి దశలో 2,768 గ్రామాల్లో సర్వే కొనసాగుతుండగా, ఇప్పటివరకు 245 గ్రామాల్లో పూర్తయిందన్నారు. తొలి దశ సర్వేను నవంబర్ చివరి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు.

ప్రతి మండలంలో రెండు సర్వే బృందాలను ఏర్పాటు చేశామని, తహసీల్దార్లు ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో పర్యటించి పనులను పర్యవేక్షించాలని సూచించారు. సర్వే పురోగతి, గ్రామాల వారీగా వివరాలు, సాంకేతిక పరికరాల వినియోగాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు హైదరాబాద్‌లో ప్రత్యేక డాష్‌బోర్డును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అవసరమైన సర్వేయర్లు, రోవర్లు, ఇతర పరికరాల కొనుగోలుకు నిధుల కొరత ఉండదని స్పష్టం చేశారు. ప్రతి వారం అధికారులు, 15 రోజులకు ఒకసారి తాను సమీక్ష నిర్వహిస్తానన్నారు.

రీ–సర్వే పేరుతో ప్రజల నుంచి ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ భూముల సరిహద్దుల గుర్తింపు సమయంలో సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావా లని సూచించారు.

**ఎర్రవల్లి భూములపై చర్యలు**

మీడియాతో మాట్లాడిన మంత్రి.. ఎర్రవల్లిలో 385 ఎకరాలకు సంబంధించి 45 ఎకరాల భూమి తక్కువగా ఉన్నట్లు గుర్తించామని, సర్వే కోసం మరోసారి నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. అక్కడ చేతులు మారిన అసైన్డ్ భూములను గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ చేస్తామని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అమరవీరులను గుర్తించి వారికి న్యాయం చేస్తామని వెల్లడించారు.

## సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి

**- హరీశ్ రావు**



**ముద్ర, హైదరాబాద్:** కేంద్ర ఎన్నికల సంఘం ప్రజల్లో విశ్వసనీయతను కోల్పోతే సీఈసీ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం ప్రజాస్వామ్యానికి వెన్నెముకగా ఉండాలే తప్ప అధికారంలో ఉన్నవారికి రక్షణ కవచంగా మారకూడదని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. అర్హులైన పౌరుల ఓటు హక్కులను కాలరాస్తే సీఈసీదే పూర్తి బాధ్యత అని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం స్వతంత్రత, నియామకాలపై అనుమానాలు వ్యక్తమవడం రాజ్యాంగ ప్రజాస్వామ్యానికి ముప్పు అని హెచ్చరించారు. వ్యక్తులు, ప్రభుత్వాల కంటే ప్రజాస్వామ్యమే గొప్పదని పేర్కొంటూ ‘Gyanesh Its Done Bro’ అంటూ సీఈసీ వైఖరిపై విమర్శలు గుప్పించారు.

## ‘గ్లోబల్ కాన్ఫిడెన్స్ సెంటర్’గా హైదరాబాద్

*** ప్రపంచ స్థాయి సమస్యలకు పరిష్కారాలు కనుగొనే ‘ఎకో సిస్టమ్’**
*** గ్లోబల్ కంపెనీల అవసరాలకు అనుగుణంగా అడ్వాన్స్‌డ్ డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్**
*** ఫిన్‌టెక్ దిగ్గజం ‘బ్యాక్‌బేస్’ డెవలప్ మెంట్ సెంటర్ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు**



**ముద్ర, హైదరాబాద్ :** గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల గమ్యస్థానంగానే కాకుండా... హైదరాబాద్ ను ప్రపంచ స్థాయి సమస్యలకు పరిష్కారాలు కనుగొనే ‘గ్లోబల్ కాన్ఫిడెన్స్ సెంటర్’గా తీర్చిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. గ్లోబల్ మార్కెట్ అవసరాలు, సవాళ్లు, భవిష్యత్ సాంకేతిక మార్పులకు అనుగుణంగా దిగ్గజ కంపెనీలను ఆకర్షించే కాంప్రహెన్సివ్ ఎకో సిస్టంను రాష్ట్రంలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. హైటెక్ సిటీలో 30వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన నెదర్లాండ్స్ గ్లోబల్ ఫిన్‌టెక్ దిగ్గజం ‘బ్యాక్‌బేస్’ డెవలప్ మెంట్ సెంటర్ ను శుక్రవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ఆనతికాలంలోనే టెక్నాలజీ, డిజిటల్ బ్యాంకింగ్, ఫిన్‌టెక్ రంగాల్లో హైదరాబాద్ ను గ్లోబల్ కంపెనీలకు ఒక ప్రముఖ గమ్యస్థానంగా తీర్చిదిద్దామన్నారు. బ్యాక్‌బేస్ లాంటి దిగ్గజ కంపెనీల విస్తరణే ఇందుకు నిదర్శనమన్నారు. కేవలం పెట్టుబడులను ఆకర్షించడం, పెద్ద కంపెనీలను రప్పించడమే కాకుండా... డిజిటల్ బ్యాంకింగ్ సొల్యూషన్స్, సాఫ్ట్ వేర్ ఇంజినీరింగ్ అండ్ ప్రొడక్ట్ డెవలప్ మెంట్, క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ లాంటి రంగాల్లో ఉపాధి అవకాశాలను దక్కించుకునేలా తెలంగాణ యువతను సంసిద్ధం చేయడంపై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. గ్లోబల్ కంపెనీల అవసరాలకు అనుగుణంగా రాష్ట్రంలో అడ్వాన్స్డ్ డిజిటల్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ను అందుబాటులోకి తెచ్చేలా ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తున్నామన్నారు. ప్రస్తుతం సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారాలు చూపే సత్తా టెక్నాలజీకి ఉందని, ఆ దిశగా కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలతో ముందుకొచ్చే వారికి ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు నెక్ట్స్ జనరేషన్ డిజిటల్ బ్యాంకింగ్ సొల్యూషన్స్, సాఫ్ట్ వేర్ ఉత్పత్తులను అందించడంలో ఈ బ్యాక్‌బేస్ డెవలప్‌మెంట్ సెంటర్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఇక్కడ కొత్తగా 300 మంది హై–స్కిల్డ్ వర్క్ ఫోర్స్ కు ఉద్యోగాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో నెదర్లాండ్స్ డిప్యూటీ కాన్సుల్ జనరల్ యాన్ క్రెమర్స్, బ్యాక్‌బేస్ సీటీఓ గ్రెగ్ ఫాహి, చీఫ్ ఆఫ్ స్టాఫ్ రీన్‌హార్డ్ షీల్, ఇండియా సైట్ హెడ్ సురభి శర్మ పాల్గొన్నారు.

# ఎల్‌నినో నేపథ్యంలో ఉద్యాన పంటలకు ప్రోత్సాహం

**10 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు లక్ష్యం**
**కోకో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు**

**ముద్ర, హైదరాబాద్** : హైదరాబాద్: ఎల్‌నినో నేపథ్యంలో రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పిస్తూ ఉద్యాన పంటలను ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం సచివాలయంలో ఉద్యాన శాఖ, ఆయిల్ ఫెడ్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో పలు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో సుగంధ ద్రవ్యాల సాగు 65 శాతం, ఎర్రమిరప 83 శాతం, ఇతర సుగంధ ద్రవ్యాలు 192 శాతం, పూల సాగు 198 శాతం పెరగడం శుభపరిణామమన్నారు. కూరగాయల సాగును విస్తరించి, ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలని సూచించారు.

రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగుకు అనుకూలత ఉందని, కనీసం 10 లక్షల ఎకరాల్లో సాగు చేపట్టేలా ప్రణాళిక రూపొందించాలని మంత్రి ఆదేశించారు. ఏటా 2 లక్షల ఎకరాల్లో సాగు లక్ష్యం గా నాణ్యమైన మొక్కలను సిద్ధం చేయాలన్నారు. ప్రతి ఉమ్మడి జిల్లాలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని, నిర్మాణంలో ఉన్న వాటిని సంక్రాంతి నాటికి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. లక్ష్యాలను సాధించని కంపెనీలకు కేటాయించిన జిల్లాలను రద్దు చేస్తామని స్పష్టం చేశారు.

ఆయిల్ పామ్ తోటల్లో అంతరపంటగా కోకో సాగును ప్రోత్సహించాలని, తొలిదశలో అశ్వారావుపేట, దమ్మపేటలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటును పరిశీలించాలని తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని ఏకీకృత నోడల్ ఏజెన్సీ ద్వారా అమలు చేయాలని, ఆయిల్ ఫెడ్ ఖాళీల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి కె. సురేంద్రమోహన్, ఉద్యాన శాఖ, ఆయిల్ ఫెడ్ ఎండీ యాస్మిన్ బాషా తదితరులు పాల్గొన్నారు.



# మెడికల్ టూరిజం అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక

**- గ్లోబల్ సమ్మిట్‌కు ముందే డీపీఆర్‌లు సిద్ధం చేయాలి**
**- సీఎస్ సంజయ్ జాజు**

**ముద్ర, హైదరాబాద్** : తెలంగాణలో మెడికల్ వెల్‌నెస్ టూరిజం అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. తెలంగాణ టూరిజం పాలసీ 2025–30లో భాగంగా అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రాన్ని వైద్య పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని సూచించారు.సచివాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ప్రపంచస్థాయి ఆసుపత్రులు, ఆధునిక వైద్య పరికరాలు, నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉండటం రాష్ట్రానికి అనుకూలమని పేర్కొన్నారు. మెడికల్ టూరిజం ప్రాజెక్టులకు సంబంధించిన వివరణాత్మక ప్రాజెక్టు నివేదికలను (డీపీఆర్‌లు) తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు ముందే సిద్ధం చేయాలని ఆదేశించారు.

వైద్య సేవలను సులభతరం చేసేందుకు వివిధ శాఖలు, ఆసుపత్రుల మధ్య సమన్వయం పెంచడంతో పాటు సింగిల్ విండో పోర్టల్ ఏర్పాటు చేయాలని సూచించారు. పెట్టుబడులు, అంతర్జాతీయ ప్రచారం, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. అవయవ మార్పిడి చికిత్సలకు సంబంధించిన ప్రక్రియల్లో పారదర్శకత పెంచాలని ఆదేశించారు. ఈ సమావేశంలో వాణి ప్రసాద్, క్రిస్టినా జెడ్ చోంగ్తు, సిక్త పట్నాయక్ తదితర అధికారులు పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in | @mudranews

శనివారం,
10 అక్టోబర్, 2026

4

వేదిక
Peoples Voice

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్‌గా మీ భావాలను వ్యక్తీకరించండి..

వాట్సప్ నం.: 9849623744
మెయిల్: mudradaily@gmail.com



## ఈ మూడు కలిపి తాగితే బరువు మాయం

ప్రస్తుత కాలంలో రకరకాల ఆహార పదార్థాలను తినాల్సి వస్తుంది. ముఖ్యంగా చాలా మంది ఇంట్లో వండిన ఆహారం కంటే బయట దొరికే స్ట్రీట్ ఫుడ్ ఎక్కువ తీసుకుంటున్నారు. ఇలాంటివారు జీర్ణ సమస్యలను ఎక్కువగా ఎదుర్కోవాల్సి వస్తుంది. అయితే ఈ సమస్యలు రాకుండా ఉండాలంటే.. ఇంట్లో లభించే కొన్ని పదార్థాలతో కషాయం చేసుకొని తాగుతూ ఉండాలి. దీనివల్ల కడుపు క్లీనై సౌకర్యవంతంగా ఉంటుంది. మరి ఇంట్లో దొరికే ఆ కషాయం ఏంటో ఇప్పుడు చూద్దాం..

సాధారణంగా మనం వండే కూరల్లో జీలకర్ర వేస్తుంటాం. ఇది పైకి కనిపించకపోయినా ఇది ఎక్కువగా ఉపయోగించిన ఆహారం తినడం వల్ల ఆరోగ్యంగా ఉండగలుగుతారు. అయితే ఈ జీలకర్రతో పాటు వాము, సోంపు కలిపి వేడి నీటిలో మరగపెట్టి తాగడం వల్ల జీర్ణక్రియ సమస్యలు లేకుండా పోతాయి. ఉదయాన్నే రకరకాల ఆహార పదార్థాలు తిన్నవారు కడుపులో అసౌకర్యంగా ఉంటే కూడా దీనిని తీసుకోవచ్చు.

కేవలం జీర్ణ సమస్యలు మాత్రమే కాకుండా బరువు నియంత్రణ కోసం కూడా ఈ పానీయాన్ని తీసుకోవచ్చు. ప్రస్తుత కాలంలో చాలా మంది బరువుతో ఇబ్బంది పడుతున్నారు. బరువు తగ్గడానికి అనేక వ్యాయామాలు చేస్తున్నారు. అయితే ఉదయాన్నే ఈ మూడు కలిపిన నీటిని ప్రతిరోజు ఉదయం కొన్ని రోజులపాటు తాగడం వల్ల కడుపులో ఉండే కొవ్వు దాదాపు కరిగిపోయే అవకాశాలున్నాయని ఆరోగ్య నిపుణులు చెప్తున్నారు.

ఇవే కాకుండా షుగర్ అదుపులో ఉండడానికి కూడా ఈ కషాయం తాగితే సరైన ఫలితాలు ఉంటాయనిచెబుతున్నారు. అయితే వీరు వైద్యుల సలహా మేరకు మాత్రమే తీసుకోవాలి. అంతేకాకుండా ఎక్కువగా ఉష్ణోగ్రత కలిగిన వారు సైతం వీటి విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే మసాలా దినుసుల్లో భాగమే జీలకర్ర ను ఉపయోగిస్తారు. అందువల్ల ఈ కషాయం తాగడం వల్ల ఉష్ణోగ్రత పెరిగే అవకాశం ఉంటుంది.

అంతేకాకుండా ప్రతిరోజు ఉదయం దీనిని తీసుకోవడం వల్ల రోజంతా ఎలాంటి ఆహారం తీసుకున్న కూడా జీర్ణక్రియ సక్రమంగా ఉండే అవకాశం ఉంటుంది. వీటితో పాటు వ్యాయామం చేయడం వల్ల తొందర్లోనే బరువు తగ్గే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు.



## బతకడం వేరు జీవించడం వేరు

బతకడం వేరు. జీవించడం వేరు. జీవితం అంటే తెలిసినవారు, జీవించడం ఎరిగిన మన పూర్వీకులు జీవించారు. బ్రతకడం మాత్రమే తెలిసిన వారు ఈనాడు రోజులు వెళ్ళబోస్తున్నారు.

రేడియో మాత్రమే ఉండి, పెరట్లో మూగజీవాలు సందడి చేస్తూండగా, చావిడిలో పశుసంపద పిలుస్తూండగా తెల్లారే రోజులు అవి. లేవగానే మనసు ఆహ్లాదంగా, ప్రశాంతంగా ఉంటే రోజంతా అలాగే ఉండేది. తనకోసం తాను బతకడం మాత్రమే గాక, తనచుట్టూ వుండే పశుపక్ష్యాదులను చూసుకుంటూ వాటి అవసరాలు కూడా తీర్చడంలో మునిగిన ఆడ మగవారికి అనవసరమైన విషయాలపై దృష్టి మళ్ళేది కాదు.

జీవన విధానంలో ఆడమగ జీవితాలపై చర్చ ఉండకపోవడం మహా ప్రసాదం. ఒకరికోసం మరొకరు, అంతే. ఎవరి విధులు వారివి, ఎదుటివారికి సహాయం చేసే ఆలోచన ఒక వరం.

మహాలయ పక్షంలో ఆనాటి పెద్దలు యథాప్రకారం వచ్చి, తమ వారసుల బతుకులు చూసి ఆనందిస్తారా లేక జీవించడం మరచి పోయారని దుఃఖిస్తారో తెలీదు. తెలుసుకునే అవకాశం కూడా ఉండదు. వారి కోసం మనం చేయగల ఒకేఒక సత్కార్యం, జీవించడం.

**మన పెద్దలు ఆనందమేగా మనకు కూడా ఆనందం.**

**శుభోదయం.**

## హార్ట్‌బ్రేక్ ఎందుకంత బాధిస్తుంది?

ప్రేమలో పడటం ఒక మధురమైన అనుభూతి. మనసుకు నచ్చిన వ్యక్తి జీవితంలోకి వచ్చినప్పుడు ప్రపంచమంతా కొత్తగా కనిపిస్తుంది. ఆ వ్యక్తితో మాట్లాడటం, సమయం గడపటం, భవిష్యత్తు గురించి కలలు కనటం జీవితంలో ఒక భాగమైపోతాయి. అయితే అదే వ్యక్తి ఒక్కసారిగా జీవితానికి దూరమైతే పరిస్థితి పూర్తిగా మారిపోతుంది. మనసులో బాధ, ఒంటరితనం, ఆందోళన మొదలవుతాయి. కొన్నిసార్లు ఛాతీలో బరువుగా, కడుపులో నొప్పిగా,



**కుమార్ పీవీజీ, ముద్ర**

శరీరమంతా అలసటగా కూడా అనిపిస్తుంది. ఈ అనుభవాన్నే సాధారణంగా 'హార్ట్‌బ్రేక్' అని పిలుస్తాం. అయితే, నిజంగానే గుండె పగిలిపోతుందా? ప్రేమలో విఫలమైనప్పుడు ఇంత తీవ్రమైన బాధ ఎందుకు కలుగుతుంది? దీనికి మన మెదడు పనిచేసే విధానంతో సంబంధం ఉందని శాస్త్రీయ పరిశోధనలు సూచిస్తున్నాయి.



### ప్రేమలో ఉన్నప్పుడు మెదడులో ఏం జరుగుతుంది?

ప్రేమ అనేది కేవలం భావోద్వేగానికి సంబంధించిన అనుభూతి మాత్రమే కాదు. అది మన మెదడులోని ప్రేరణ, ప్రతిఫలం, అనుబంధాలకు సంబంధించిన వ్యవస్థలతోనూ ముడిపడి ఉంటుంది. మనకు ఇష్టమైన వ్యక్తిని చూసినప్పుడు లేదా వారి గురించి ఆలోచించినప్పుడు మెదడులోని కొన్ని ప్రాంతాలు చురుకుగా పనిచేస్తాయి. ప్రేమించిన వ్యక్తి మన జీవితంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నప్పుడు, మన ఆలోచనలు, అలవాట్లు, రోజువారీ కార్యక్రమాలపై వారి ప్రభావం పెరుగుతుంది. వారు ఎలా ఉన్నారు? మనతో మాట్లాడుతున్నారా? మన గురించి ఏమనుకుంటున్నారు? వంటి ఆలోచనలు పదేపదే మనసులో మెదులుతుంటాయి. దీనికి కారణం ప్రేమ మన దృష్టిని, భావోద్వేగాలను ఒక వ్యక్తి వైపు బలంగా మళ్లించగలగడమే. మనుషులు పరస్పరం అనుబంధాలు ఏర్పరుచుకోవడం సామాజిక జీవితంలో కీలకమైన అంశం. కుటుంబం, స్నేహితులు, ప్రేమ సంబంధాలు భావోద్వేగపరమైన మద్దతును అందిస్తాయి.

### మనల్ని మనం చూసుకునే విధానాన్ని కూడా మార్చే అనుబంధం

ఒక వ్యక్తితో బలమైన ప్రేమ సంబంధం ఏర్పడినప్పుడు, ఆ వ్యక్తి మన జీవితంలో భాగమైపోతారు. వారి ఇష్టాలు, అభిరుచులు, ఆలోచనలు మనకు కూడా ముఖ్యమవుతాయి. భవిష్యత్తు ప్రణాళికల్లోనూ వారికి స్థానం కల్పిస్తాం. కొంతకాలానికి మన వ్యక్తిగత గుర్తింపులోనూ ఆ సంబంధం భాగమవుతుంది. అందుకే ప్రేమ సంబంధం ముగిసినప్పుడు, మనం ఒక వ్యక్తిని మాత్రమే కోల్పోయినట్లు కాకుండా, వారితో ముడిపడిన అలవాట్లు, ఆశలు, భవిష్యత్తు ప్రణాళికలను కూడా కోల్పోయినట్లు అనిపించవచ్చు. ఈ మార్పు మనసులో పెద్ద ఖాళీని సృష్టిస్తుంది. గతంలో సాధారణంగా అనిపించిన ప్రదేశాలు, పాటలు, మాటలు కూడా విడిపోయిన వ్యక్తి జ్ఞాపకాలను గుర్తుకు తెస్తాయి.

### హార్ట్‌బ్రేక్ కూడా నిజమైన బాధే!

ప్రేమలో విఫలమైనప్పుడు కలిగే బాధను చాలా మంది చిన్న విషయంగా భావిస్తారు. 'మర్చిపో', 'మరో వ్యక్తి దొరుకుతారు', 'ఇంతకోసం బాధపడాలా?' అంటూ సలహాలు ఇస్తుంటారు. అయితే హార్ట్‌బ్రేక్ అనేది అంత తేలిగ్గా పక్కన పెట్టగలిగే అనుభవం కాదు. తిరస్కరణ, విడిపోవడం వంటి అనుభవాల సమయంలో మెదడులోని కొన్ని ప్రాంతాలు శారీరక నొప్పి అనుభవంలోనూ పాల్గొంటాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. అయితే భావోద్వేగ బాధ, శారీరక నొప్పి రెండూ పూర్తిగా ఒకటేనని దీని అర్థం కాదు. వాటి మధ్య కొన్ని నాడీ సంబంధిత పోలికలు ఉన్నాయని మాత్రమే చెప్పవచ్చు. అందుకే హార్ట్‌బ్రేక్ సమయంలో కొందరికి ఛాతీలో బరువు, ఆకలి తగ్గడం, నిద్రలేమి, అలసట, ఏకాగ్రత లోపించడం వంటి సమస్యలు ఎదురవుతాయి. ప్రతి ఒక్కరిలో ఈ లక్షణాలు ఒకే విధంగా ఉండవు. బాధ తీవ్రత, దాని నుంచి కోలుకునే సమయం కూడా వ్యక్తిని బట్టి మారుతాయి.

### విడిపోయిన తర్వాత మళ్లీ మళ్లీ ఆ వ్యక్తే ఎందుకు గుర్తుకొస్తారు?

బ్రేకప్ తర్వాత మాజీ భాగస్వామి గురించి పదేపదే ఆలోచించడం, వారి సోషల్ మీడియా ఖాతాలను చూడాలనిపించడం, పాత ఫొటోలు పరిశీలించడం వంటివి కొందరిలో కనిపిస్తాయి. దీనికి గత జ్ఞాపకాలు, అలవాట్లు, భావోద్వేగ అనుబంధం కారణం కావచ్చు. రోజూ ఒక వ్యక్తితో మాట్లాడటం అలవాటైనప్పుడు, ఆ సంభాషణ ఒక్కసారిగా ఆగిపోవడం జీవితంలో మార్పును సృష్టిస్తుంది. ఆ వ్యక్తి నుంచి సందేశం వస్తుందేమోనని ఎదురుచూడటం కూడా కొంతకాలం కొనసాగవచ్చు. అయితే ఇలాంటి ఆలోచనలు నిరంతరం కొనసాగుతూ రోజువారీ జీవితాన్ని ప్రభావితం చేస్తే, వాటి నుంచి బయటపడేందుకు ఆరోగ్యకరమైన అలవాట్లు, నమ్మకమైన వ్యక్తుల మద్దతు అవసరమవుతాయి.

### బలమైన సంబంధాలు మన ఆరోగ్యానికి ఎందుకు ముఖ్యం?

మనిషి జీవితంలో సామాజిక సంబంధాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. కుటుంబ సభ్యులు, స్నేహితులు, జీవిత భాగస్వామి నుంచి లభించే మద్దతు ఒత్తిడిని ఎదుర్కోవడానికి సహాయపడుతుంది. ఇతరులతో మన భావాలను పంచుకోవడం వల్ల ఒంటరితనం తగ్గవచ్చు. బలమైన సామాజిక అనుబంధాలు మెరుగైన ఆరోగ్యంతో, దీర్ఘకాలిక శ్రేయస్సుతో సంబంధం కలిగి ఉన్నాయని అనేక పరిశోధనలు సూచిస్తున్నాయి. అదే సమయంలో ఒంటరితనం, సామాజిక మద్దతు లేకపోవడం కొందరిలో మానసిక, శారీరక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపవచ్చు. అయితే ప్రేమ సంబంధమే జీవితానికి ఏకైక ఆధారం కాదు. కుటుంబం, స్నేహితులు, సమాజంతో అనుబంధం, వ్యక్తిగత ఆసక్తులు, లక్ష్యాలు జీవితానికి అర్థాన్ని ఇస్తాయి.

### హార్ట్‌బ్రేక్ నుంచి ఎలా కోలుకోవాలి?

ప్రేమ సంబంధం ముగిసినప్పుడు బాధ కలగడం సహజం. ఆ బాధను వెంటనే మర్చిపోవాలని మనల్ని మనం బలవంతం చేసుకోవాల్సిన అవసరం లేదు. కోలుకోవడానికి సమయం తీసుకోవడం, తగినంత నిద్రపోవడం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, వ్యాయామం చేయడం, నమ్మకమైన వ్యక్తులతో మాట్లాడటం ఉపయోగకరంగా ఉంటుంది. తీవ్రమైన బాధ ఎక్కువకాలం కొనసాగినా, రోజువారీ పనులు చేసుకోలేని పరిస్థితి ఏర్పడినా మానసిక ఆరోగ్య నిపుణుల సహాయం తీసుకోవడం మంచిది. ఛాతీలో తీవ్రమైన నొప్పి లేదా ఇతర ఆందోళనకరమైన శారీరక లక్షణాలు కనిపిస్తే వాటిని కేవలం హార్ట్‌బ్రేక్‌గా భావించకుండా వైద్య సహాయం పొందాలి.

### మనల్ని మనం ప్రేమించుకోవడం కూడా అంతే ముఖ్యం

హార్ట్‌బ్రేక్ మనకు ఒక ముఖ్యమైన విషయాన్ని గుర్తుచేస్తుంది. మనుషులకు ప్రేమ, అనుబంధాలు అవసరం. అయితే ఒక సంబంధం ముగిసినంత మాత్రాన మన జీవితం ముగిసిపోదు. ఒక వ్యక్తి మన జీవితంలో లేకపోయినా మన విలువ తగ్గిపోదు. ప్రేమ మన మెదడును, భావోద్వేగాలను ప్రభావితం చేయగలదు. బలమైన అనుబంధాలు మన జీవితాన్ని సుసంపన్నం చేయగలవు. అదే సమయంలో ఆ అనుబంధం తెగిపోయినప్పుడు కలిగే బాధ నుంచి బయటపడటానికి మనకు సమయం, మద్దతు, ఆత్మవిశ్వాసం అవసరం. హార్ట్‌బ్రేక్ అంటే కేవలం గుండెకు సంబంధించిన విషయం కాదు. మన భావోద్వేగాలు, మెదడు, జ్ఞాపకాలు, అనుబంధాలు, జీవిత అనుభవాలతో ముడిపడిన సంక్లిష్టమైన అనుభూతి. ఆ బాధను అర్థం చేసుకోవడం, బాధపడుతున్న వారిని ఆదుకోవడం, మనల్ని మనం తిరి గి నిలబెట్టుకోవడంఇవే దాని నుంచి ముందుకు సాగడానికి కీలకం.

## బతుక అమ్మ

**పల్లవి**
బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..
బంగారు బతుకమ్మ ఉయ్యాల
**చరణం**
తంగేడు గునుగుతో ఉయ్యాలో..
తల్లి తెలంగాణ ఉయ్యాల
పల్లె పట్నం దాటి ఉయ్యాలో..
ప్రపంచమంతటా ఉయ్యాల
తెలంగాణ సంస్కృతి ఉయ్యాలో..
దశదిశలా చాటాలి ఉయ్యాల
చెరువులన్నీ నిండిఉయ్యాలో..
చేలన్నీ పండాలి ఉయ్యాల
నేల నీరు గాలి ఉయ్యాలో..
ప్రకృతి బతకాలి ఉయ్యాల
ప్రకృతి బతికితే ఉయ్యాలో..
మన బతుకు బతుకమ్మ ఉయ్యాల
**పల్లవి**
(బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..
బంగారు బతుకమ్మ ఉయ్యాల)
**చరణం**
పూలల్లో పుట్టింది ఉయ్యాలో
పూలల్లో పెరిగింది ఉయ్యాల
బతుకమ్మ అంటేనే ఉయ్యాలో
ఆడపడుచుల పండుగ ఉయ్యాల
ఆడపిల్ల అంటే ఉయ్యాలో
సృష్టికే మూలం ఉయ్యాల
ఆడపిల్లాలంటే ఉయ్యాలో
జగతికే వెలుగమ్మా ఉయ్యాల
తల్లి చెల్లి ఆలీ ఉయ్యాలో
తనువులో భాగము ఉయ్యాల
మన ఇంటి మహాలక్ష్మి ఉయ్యాలో..
మన కంటి పాపమ్మ ఉయ్యాల
**పల్లవి**
(బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..
బంగారు బతుకమ్మ ఉయ్యాల)
**చరణం**
ఆడ మగ తేడా ఉయ్యాలో
అస్సలే వద్దమ్మా ఉయ్యాల
పూలమ్మ బతుకమ్మ ఉయ్యాలో..
కాపాడు పిల్లల్ని ఉయ్యాల
కడుపులో పాపల్ని ఉయ్యాలో..
కడతేర్చుట పాపం ఉయ్యాల
పాప పుడితే పండుగ ఉయ్యాలో..
దండిగా చేద్దాం ఉయ్యాల
బాల్యవివాహాలు ఉయ్యాలో..
చేసి చిదిమేయ్యొద్దు ఉయ్యాల
అవనిలో సగభాగం ఉయ్యాలో
హక్కులే దక్కాలి ఉయ్యాల
**పల్లవి**
(బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..
బంగారు బతుకమ్మ ఉయ్యాల..)
**చరణం**
ఆకతాయిలను ఉయ్యాలో..
అణచివేయాలమ్మా ఉయ్యాల
రేపుల దాదుల్ని ఉయ్యాలో
తన్ని తరిమేయాలే ఉయ్యాల
కళేజి ర్యాగింగ్ ఉయ్యాలో..
కట్టడి చేయాలె ఉయ్యాల
ఇంటా బయటా హింసలు
య్యాలో..
ఇకనైనా ఆగాలి ఉయ్యాల
వరకట్న వేధింపులుయ్యాలో..
ఏ వధువుకుండొద్దు ఉయ్యాల
చట్టాలు ఆడోల్ల కుయ్యాలో..
అభయమై నిలవాలి ఉయ్యాల
**పల్లవి**
(బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..
బంగారు బతుకమ్మ ఉయ్యాల)
**చరణం**
మూఢనమ్మకాలు ఉయ్యాలో..
మూర్ఖపు ఆలోచనలు ఉయ్యాల
పారదోలాలమ్మ ఉయ్యాలో
మారాలి మనమంతా ఉయ్యాల
ఆడమగ తేడా ఉయ్యాలో..
అంతమైపోవాలి ఉయ్యాల
చదువులోనే వెలుగు ఉయ్యాలో..
అజ్ఞానము తొలుగు ఉయ్యాల
ఇంటి పనిలో ఇద్దరూ ఉయ్యాలో..



**గడగోజు రవీంద్రాచారి**
జర్నలిస్టు, రచయిత, నకిరేకల్
9848772232

ఇలలో సమానం ఉయ్యాల
పనికి తగ్గ ఫలం ఉయ్యాలో..
వేతనాల్లో సమం ఉయ్యాల
**చరణం**
అన్ని రంగాలలో ఉయ్యాలో..
రాణించ కదలాలి ఉయ్యాల
తలవంచక మహిళా ఉయ్యాలో
ఎదిరించి నిలవాలి ఉయ్యాల
అన్యాయామెదురించి ఉయ్యాలో..
న్యాయాన్ని కాపాడ ఉయ్యాల
రాణి రుద్రమ్మ లా ఉయ్యాలో ..
రణం చేయాలమ్మ ఉయ్యాల
ఝాన్సీ లక్ష్మీ లాగా ఉయ్యాలో
జయభేరి మోగించ ఉయ్యాల
పిడికి లెత్తాలమ్మ ఉయ్యాలో
పిడుగయ్యి మండాలి ఉయ్యాల
**పల్లవి**
(బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..
బంగారు బతుకమ్మ ఉయ్యాల..)
**ముగింపు**
బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..
బంగారు బతుకమ్మ ఉయ్యాల
ఆడబిడ్డే బలం ఉయ్యాలో..
ఆడబిడ్డే మన భవిష్యత్తుయ్యాల
ఒక్కర్ని కాపాడుతుయ్యాలో..
ఒక తరం బతుకుతుంది ఉయ్యాల
అమ్మా మా గౌరమ్మ ఉయ్యాలో..
అందరినీ దీవించు ఉయ్యాల
బతుకులు పండించు ఉయ్యాలో..
తల్లి మా బతుకమ్మ ఉయ్యాల



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శనివారం 10.10.2026
www.mudranews.in | @mudranews



**ధారాళంగా ద్రవాహారాలు:**



జ్వరం వల్ల ఒంట్లో నీటి శాతం తగ్గి డీహైడ్రేషన్ బారిన పడే ప్రమాదం ఉంది. రోజుకు సరిపడా గోరువెచ్చని నీరు, కొబ్బరి నీళ్ళు, ఓఆర్ఎస్ (ORS) ద్రావణం, సూప్‌లు మరియు తులసి కషాయం తీసుకోవడం ద్వారా శరీరంలో ఎలక్ట్రోలైట్లు సమతుల్యంగా ఉంటాయి.

# దినసరి కూలీ కుమారుడి అసాధారణ ఘనత

**ఆర్మీ కోసం అధునాతన డ్రోన్ రూపకల్పన**
**రూ.3.5 కోట్ల రక్షణ శాఖ గ్రాంట్!**
**రూ.87 వేలతో ప్రాథమిక నమూనా**
**ఐఐటీ రూర్కీలో మరింత అభివృద్ధి**

**ముద్ర, హమీర్‌పూర్ (హిమాచల్‌ప్రదేశ్):** పేదరికం ప్రతిభకు అడ్డంకి కాదని నిరూపించాడు హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన యువ ఆవిష్కర్త సర్వేష్ శర్మ. దినసరి కూలీ కుమారుడిగా ఎన్నో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూనే సాంకేతికతపై ఆసక్తితో ముందడుగు వేసిన ఆయన, భారత సైన్యం సరిహద్దు నిఘా అవసరాల కోసం ప్రత్యేక డ్రోన్ అభివృద్ధి చేసే అవకాశాన్ని దక్కించుకున్నాడు. ఆయన రూపొందించిన ప్రాజెక్టుకు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ రూ.3.5 కోట్ల గ్రాంట్ మంజూరు చేసింది. దీంతో సాధారణ కుటుంబం నుంచి వచ్చిన యువకుడి ప్రతిభ జాతీయస్థాయిలో చర్చనీయాంశమైంది.

**చిన్న గదిలో మొదలైన ఆవిష్కరణ ప్రయాణం**

హిమాచల్‌ప్రదేశ్‌లోని హమీర్‌పూర్ జిల్లాకు చెందిన సర్వేష్ శర్మ బహన్వీ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం పూర్తి చేశాడు. అనంతరం హమీర్‌పూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ చదువుతున్న సమయంలో డ్రోన్ సాంకేతికతపై ప్రత్యేక ఆసక్తి పెంచుకున్నాడు. ఆయన తండ్రి దినసరి కూలీగా పనిచేస్తుండటంతో కుటుంబం ఆర్థికంగా పరిమిత వనరులపైనే ఆధారపడింది.అయినప్పటికీ తన ఆలోచనలను ఆచరణలో పెట్టేందుకు సర్వేష్ వెనుకడుగు వేయలేదు. సుమారు రూ.87 వేల ఖర్చుతో డ్రోన్ ప్రాథమిక నమూనాను రూపొందించి, దాని ఆధారంగా రక్షణ



రంగానికి ఉపయోగపడే సాంకేతిక పరిష్కారాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగాడు.

**రక్షణ శాఖ నుంచి భారీ ప్రోత్సాహం**

సర్వేష్ రూపొందించిన ప్రాజెక్టు ప్రతిపాదనను కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన డిఫెన్స్ ఇన్నోవేషన్ ఆర్గనైజేషన్ (డీఐఓ), ఇన్నోవేషన్స్ ఫర్ డిఫెన్స్ ఎక్సలెన్స్ (ఐడెక్స్) కార్యక్రమం కింద సమర్పించారు. ఈ ప్రతిపాదనకు ఆమోదం లభించడంతో డ్రోన్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు రూ.3.5 కోట్ల గ్రాంట్ మంజూరైంది.ఈ ప్రాజెక్టుకు 'రుద్ర ఎడ్జ్ టీ–1 (స్కైరా)' అనే పేరు పెట్టారు. పర్వత ప్రాంతాలు, అత్యంత ఎత్తైన సరిహద్దు ప్రాంతాల్లో నిఘా నిర్వహించేందుకు అనువైన స్వదేశీ డ్రోన్‌ను అభివృద్ధి చేయడం దీని ప్రధాన లక్ష్యం.

**రాడార్ గుర్తింపును తప్పించుకునేలా రూపకల్పన**

ప్రతిపాదిత డ్రోన్‌లో శత్రు రాడార్లకు చిక్కే అవకాశాన్ని తగ్గించే సాంకేతికత, ఎలక్ట్రానిక్ జామింగ్‌ను తట్టుకునే సామర్థ్యాలను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పర్వత ప్రాంతాల్లోని క్లిష్ట వాతావరణ పరిస్థితుల్లో సైన్యానికి నిఘా సమాచారాన్ని అందించేందుకు ఇది ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.అయితే, ఈ సాంకేతిక లక్షణాల సామర్థ్యం పూర్తిస్థాయి అభివృద్ధి, పరీక్షల అనంతరమే నిర్ధారణ కానుంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు అభివృద్ధి దశలోనే ఉంది.

**ఐఐటీ రూర్కీలో తదుపరి దశ**

డ్రోన్ అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతిష్ఠాత్మక ఐఐటీ రూర్కీలోని ఇంక్యుబేషన్ కేంద్రం ద్వారా ప్రయోగశాల సదుపాయాలు, సాంకేతిక మార్గదర్శకత్వం అందించనున్నారు. ప్రాజెక్టును సుమారు 20 నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. అనంతరం సైనిక అవసరాలకు అనుగుణంగా పరీక్షలు నిర్వహించే దిశగా పనులు సాగనున్నాయి.

**యువతకు స్ఫూర్తిగా సర్వేష్ ప్రయాణం**

పరిమిత ఆర్థిక వనరులతో ప్రారంభించిన ఆలోచనకు కేంద్రస్థాయి ప్రోత్సాహం లభించడం సర్వేష్ శర్మ ప్రయాణంలో కీలక మలుపుగా నిలిచింది. విద్యార్థి దశలోనే దేశ రక్షణ రంగానికి ఉపయోగపడే సాంకేతిక పరిష్కారాన్ని అభివృద్ధి చేసే అవకాశం పొందడం యువతలో ఆవిష్కరణల పట్ల ఆసక్తిని పెంచే అంశం.స్వదేశీ సాంకేతికతతో రక్షణ రంగ అవసరాలను తీర్చాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న ఇలాంటి యువ ఆవిష్కర్తలకు తగిన ప్రోత్సాహం లభిస్తే దేశీయ రక్షణ పరిశోధన, సాంకేతిక అభివృద్ధికి మరింత ఊతం లభించనుంది.

# కాన్షీరాంకు భారతరత్న ఇవ్వాలి

**ఆయన స్ఫూర్తితో సామాజిక న్యాయ తెలంగాణ సాధిస్తాం**

**తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత**



**ముద్ర, హైదరాబాద్:** అణగారిన వర్గాలకు రాజకీయ అధికారం దక్కాలన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను ఆచరణలో చూపిన మహనీయుడు కాన్షీరాం అని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. కాన్షీరాం వర్ధంతి సందర్భంగా శుక్రవారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాన్షీరాంకు భారతరత్న పురస్కారం ప్రకటించాలని ఆమె డిమాండ్ చేశారు.కాన్షీరాం స్ఫూర్తితో తెలంగాణలో సామాజిక న్యాయాన్ని సాధిస్తామని కవిత స్పష్టం చేశారు. అణగారిన వర్గాలకు నిజమైన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడమే ఆ మహనీయుడికి అర్పించే ఘనమైన నివాళి అని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో అణగారిన వర్గాల ప్రజలను అసెంబ్లీకి తీసుకెళ్లి తీరుతామని అన్నారు. తెలంగాణ రక్షణ సేన సామాజిక న్యాయ సంకల్పానికి కాన్షీరాం స్ఫూర్తి అని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలంతా బహుజన సాధికారత కోసం నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు.ప్రతి ఇంటికి పాంచజన్యం తీసుకెళ్లండిపార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో కవిత పిలుపుతెలంగాణ రక్షణ సేన ప్రధాన సిద్ధాంతమైన పాంచజన్యాన్ని ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆమె మాట్లాడారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు, జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యదర్శులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు వారికి అండగా నిలవాలని కవిత సూచించారు. నిజామాబాద్ జిల్లాలో రైతులను దోపిడీ చేస్తున్న దళారులను పార్టీ నాయకత్వం ప్రశ్నించడంతో ఇతర పార్టీలు సైతం రైతులకు మద్దతుగా నిలుస్తున్నాయని తెలిపారు. పార్టీ నాయకులు చేపట్టే మంచి కార్యక్రమాలు వేలాది మంది రైతులకు ప్రయోజనం చేకూరుస్తాయని, నిజామాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమాలే ఇందుకు నిదర్శనమని అన్నారు.ప్రతి నాయకుడు నిత్యం ప్రజల మధ్య ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఏడాది పొడవునా పార్టీ చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడిచినా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. ఆ హామీలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని పార్టీ శ్రేణులకు సూచించారు.రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పార్టీలతో పోటీ పడాల్సి ఉంటుందని, అందుకు పార్టీ నాయకత్వం సంసిద్ధంగా ఉండాలని కవిత పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, బహుజన సాధికారత, సామాజిక న్యాయం లక్ష్యంగా పార్టీ ముందుకు సాగాలని స్పష్టం చేశారు.

# అనుమానాస్పద స్థితిలో యువతి మృతి



**ప్రేమ వ్యవహారమే కారణమని తండ్రి అనుమానం**

**ముద్ర, కూకట్‌పల్లి:** హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ కాలనీలో ఓ యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. కేపీహెచ్‌బీ కాలనీ రోడ్ నంబర్ 1లోని ఆర్.కే. హాస్టల్‌లో ఉంటూ, స్థానిక డొమినోస్ పిజ్జా కేంద్రంలో పనిచేస్తున్న తోట ధనలక్ష్మి (22) గురువారం ఉరేసుకుని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం జిల్లా తాటిచెట్లపాలెం మండలం చిట్టిబాబు కాలనీకి చెందిన తోట రమణ కుమార్తె ధనలక్ష్మి రెండు నెలల క్రితం ఉద్యోగం కోసం హైదరాబాద్‌కు వచ్చింది. అక్టోబర్ 8న సాయంత్రం హాస్టల్ వార్డెన్ శంకర్ ఆమె తండ్రికి ఫోన్ చేసి ధనలక్ష్మి గదిలో ఉరేసుకుని కనిపించినట్లు సమాచారం అందించారు.దీంతో హైదరాబాద్‌కు చేరుకున్న తండ్రి రమణ ఆరా తీయగా, ధనలక్ష్మి గత నాలుగేళ్లుగా చింతు అనే వ్యక్తితో ప్రేమలో ఉన్నట్లు తెలిసిందని పేర్కొన్నారు. ఘటన జరిగిన రోజు ఆమె చింతుతో ఫోన్‌లో మాట్లాడిన అనంతరం గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నట్లు సమాచారం. ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో వార్డెన్ కిటికీలో నుంచి చూడగా, ఆమె ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించినట్లు తెలిసింది. వెంటనే గది తలుపులు తెరిచి చూడగా, అప్పటికే ఆమె మృతి చెందినట్లు 108 సిబ్బంది నిర్ధారించారు.చింతుతో ఏర్పడిన విభేదాలు, గొడవల కారణంగా తన కుమార్తె మనసా పానికి గురై ఉండవచ్చని, ఈ నేపథ్యంలోనే ఆమె ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో అనుమానం వ్యక్తం చేశారు. ఈ ఫిర్యాదు మేరకు కేపీహెచ్‌బీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. యువతి మృతికి గల పూర్తి కారణాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

# ఎకో టూరిజం అభివృద్ధికి ఐటీ దిగ్గజాల భాగస్వామ్యం

**ప్రకృతి పర్యాటక ప్రాంతాలకు డిజిటల్ ప్రచారం**
**అటవీ ప్రాంతాల్లో ఇంటర్నెట్ కనెక్టివిటీపై దృష్టి**
**ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమక్షంలో అధికారుల ప్రజెంటేషన్**

**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణలో పర్యావరణహిత పర్యాటకాన్ని ప్రోత్సహించడంతోపాటు, అటవీ ప్రాంతాల్లో అభివృద్ధి చెందుతున్న ఎకో టూరిజం ప్రాజెక్టులను మరింత విస్తృతంగా ప్రజలకు చేరువ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఐటీ రంగంలోని ప్రముఖ సంస్థల ప్రతినిధుల భాగస్వామ్యంతో ఎకో టూరిజం అభివృద్ధిపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన ప్రజాభవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పాల్గొన్నారు.ప్రకృతి అందాలకు డిజిటల్ ప్రచారంతెలంగాణలో అభివృద్ధి చెందుతున్న ఎకో టూరిజం ప్రాజెక్టులు, ప్రకృతి అందాలు, పర్యాటక ఆకర్షణలు, సందర్శకులకు అందుబాటులో ఉన్న సౌకర్యాలను అటవీ, పర్యాటక శాఖల అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఐటీ సంస్థల ప్రతినిధులకు వివరించారు. రాష్ట్రంలోని ప్రకృతి పర్యాటక ప్రాంతాలకు మరింత ప్రచారం కల్పించడం, పర్యాటకుల సంఖ్య పెరిగేలా అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకోవడంపై చర్చించారు.అటవీ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సౌకర్యాలుఎకో టూరిజం ప్రాంతాలను సందర్శించాలనుకునే పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంపై సమావేశంలో ప్రత్యేకంగా దృష్టి సారించారు. ముఖ్యంగా అటవీ ప్రాంతాల్లో ఇంటర్నెట్ కనెక్టివిటీని అందుబాటులోకి తీసుకురావడం ద్వారా పర్యాటకులు ఆయా ప్రాంతాల వివరాలను డిజిటల్ వేదికలపై తెలుసుకునేలా ప్రోత్సహించాలని భావిస్తున్నారు.ఐటీ రంగంలోని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని తెలంగాణ ప్రకృతి పర్యాటక ప్రాంతాలకు విస్తృత ప్రచారం కల్పించడం, పర్యాటకులకు అవసరమైన సమాచారాన్ని సులభంగా అందించడం, ఎకో టూరిజం అవకాశాలను విస్తరించడంపై సమావేశంలో చర్చించారు.ఈ కార్యక్రమంలో అటవీ దళాధిపతి వినయ్‌కుమార్, సీసీఎఫ్‌లు శరవణన్, ప్రియాంక వర్గీస్, క్షితిజ, పర్యాటక శాఖ డైరెక్టర్ రంజిత్ నాయక్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## మలబార్ గోల్డ్ & డైమండ్స్‌లో "మైన్" డైమండ్ షో ప్రారంభం

**ముద్ర, కూకట్‌పల్లి :** ప్రముఖ అంతర్జాతీయ ఆభరణాల సంస్థ మలబార్ గోల్డ్ & డైమండ్స్ కూకట్‌పల్లి షోరూంలో 'మైన్ డైమండ్ షో' ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రదర్శన అక్టోబర్ 9 నుండి అక్టోబర్ 18, 2026 వరకు వినియోగదారులకు అందుబాటులో ఉంటుంది. ఈ ప్రత్యేక ప్రదర్శనను షోరూమ్ ప్రతినిధులు, ప్రముఖులు, వినియోగదారులు మరియు శ్రేయోభిలాషుల సమక్షంలో వైభవంగా ప్రారంభించారు. ప్రదర్శనలో రోజూ ధరించే తేలికపాటి (లైట్ వెయిట్) నగలు, వివాహ ఆభరణాలు మరియు పురుషుల ప్రత్యేక వజ్రాభరణాల సముదాయాన్ని విక్రయానికి ఉంచారు.వినియోగదారుల నమ్మకాన్ని కాపాడేందుకు మలబార్ గోల్డ్ '12 న్యాయమైన వాగ్దానాలను' అందిస్తోంది. ఇందులో పారదర్శక ధరల పట్టి, 100%





BIS హాల్‌మార్క్ HUID బంగారం, IGI & GIA ధృవీకరించిన వజ్రాలు, ఉచిత జీవితకాల నిర్వహణ, క్యారెట్ ఎనలైజర్ తనిఖీ మరియు 100% ఎక్స్ఛేంజ్ విలువ వంటి ప్రత్యేకతలు ఉన్నాయి. 1993లో కేరళలో ప్రారంభమైన మలబార్ గ్రూప్, ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 14 దేశాల్లో 450కి పైగా షోరూమ్‌లతో అంతర్జాతీయ స్థాయిలో 5వ అతిపెద్ద జ్యువెలరీ రిటైలర్‌గా కొనసాగుతోంది.

## బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు



**ముద్ర, హైదరాబాద్:** బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్‌పర్సన్ గద్వాల్ విజయ లక్ష్మి అన్నారు. రాష్ట్రంలోని మహిళలందరికీ ఆమె హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఆడపడుచులు ఎంతో భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకునే బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, ప్రకృతిపై ప్రేమకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఇంటా సంతోషాలు నింపాలని, మహిళలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆమె ఆకాంక్షించారు.

## ఆర్టీఐ అమలులో సూర్యాపేట జిల్లాకు రాష్ట్రస్థాయి పురస్కారం

**రాష్ట్రంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లాగా ఎంపిక**
**గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**ముద్ర, సూర్యాపేట, అక్టోబర్ 9:** సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) అమలులో సూర్యాపేట జిల్లా రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందింది. ఈ చట్టం అమలులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లాగా సూర్యాపేట ఎంపికైంది. ఈ సందర్భంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు.పారదర్శక పాలనకు గుర్తింపుప్రజలకు సమాచార హక్కు చట్టం ద్వారా పారదర్శకమైన పాలన అందించడం, దరఖాస్తులను సకాలంలో పరిష్కరించడం, సమాచారాన్ని వేగంగా అందించడంలో జిల్లా యంత్రాంగం చూపిన చొరవకు ఈ పురస్కారం దక్కింది. అధికారులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తూ ఆర్టీఐ దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ఈ గుర్తింపు సాధించినట్లు అధికారులు తెలిపారు.కలెక్టర్‌కు అభినందనలురాష్ట్రస్థాయిలో సూర్యాపేట జిల్లాకు పురస్కారం లభించడంపై జిల్లా అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి ప్రేమ్ రాజ్, సీపీఓ కిషన్, సీఎఫ్‌ఓ దామోదర్ రెడ్డి, ఆర్డీఓ పురుషోత్తం రెడ్డి, డీటీఓర్‌టీ వల్లో శ్రీనివాసరావు, డీడీ అడల్ట్ ఎడ్యుకేషన్ సీహెచ్. అనిల్ కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఉపేందర్, డీఎస్ఓ వెంకట్ రెడ్డి, డీఐఈఓ సులోచన రాణి, జనరల్ మేనేజర్ (పరిశ్రమలు) భారతి తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌లో మెరిసిన గ్రాండ్ మాస్టర్



**ముద్ర, కూకట్‌పల్లి :** నిజాంపేట్ రోడ్‌లోని 'కుంగ్‌ఫూ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ' వ్యవస్థాపకులు, గ్రాండ్ మాస్టర్ డాక్టర్ టి. గోపీ కృష్ణ గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అధికారిక ప్రయత్నంలో పాల్గొని తమ మార్షల్ ఆర్ట్స్ ప్రతిభను చాటుకున్నారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ మాస్టర్స్ విభాగంలో పాల్గొన్న ఆయన, కేవలం 20 నిమిషాల వ్యవధిలో 40 సార్లు కరాటే 'కటా'ను ప్రదర్శించి ఈ ఘనత సాధించారు. ఈ అధికారిక రికార్డుకు సంబంధించిన సర్టిఫికెట్, పతకాన్ని ఆయన ఇటీవల అందుకున్నారు.ఈ సందర్భంగా కేపీహెచ్‌బీ కాలనీ సర్కిల్ ఇన్ స్పెక్టర్ (సీఐ) జి. విజయ్ కుమార్‌ను డాక్టర్ గోపీ కృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి, గిన్నిస్ రికార్డు సర్టిఫికెట్ మరియు పతకాన్ని చూపించారు. డాక్టర్ గోపీ కృష్ణ సాధించిన ఈ విశేష ఘనతను సీఐ విజయ్ కుమార్ అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కఠోర సాధన, పట్టుదల, క్రమశిక్షణ ఉంటే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని డా. గోపీ కృష్ణ నిరూపించారని, మార్షల్ ఆర్ట్స్ రంగంలో ఆయన అందిస్తున్న సేవలు యువతకు, క్రీడాకారులకు ఎంతో స్ఫూర్తిదాయకమని సీఐ కొనియాడారు.

## బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



**ముద్ర, కూకట్‌పల్లి :** క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న పేద కుటుంబానికి తనవంతు సహాయం అందిస్తానని కేపీహెచ్‌బీ కాలనీ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి హామీ ఇచ్చారు. బాలానగర్ రాజు కాలనీలోని షారోన్ మినిస్ట్రీస్ సంఘానికి చెందిన పాస్టర్ రాజు, సంఘ సభ్యులతో కలిసి సతీష్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా రాజు కాలనీలో గత 30 ఏళ్లుగా నివసిస్తున్న రాజకుమార్ కుటుంబ ఆర్థిక పరిస్థితిని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రాజకుమార్ తీవ్ర అనారోగ్యంతో క్యాన్సర్‌తో బాధపడుతున్నారని, వారి ఇద్దరు పిల్లల చదువుకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. అలాగే సొంత ఇల్లు లేకపోవడంతో నివాస సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.స్పందించిన సతీష్ రెడ్డి, రాజకుమార్ ఇద్దరు పిల్లల చదువుల కోసం తన సొంత నిధుల నుంచి ఆర్థిక సహాయం అందిస్తానని ప్రకటించారు. అంతేకాకుండా, ప్రభుత్వం నుంచి ఆ కుటుంబానికి డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు మంజూరయ్యేలా సంబంధిత అధికారులతో మాట్లాడి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. తమ సమస్య పట్ల సానుకూలంగా స్పందించి అండగా నిలిచిన శేరి సతీష్ రెడ్డికి పాస్టర్ రాజు, షారోన్ మినిస్ట్రీస్ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ మైనారిటీ చైర్మన్‌గా మొహమ్మద్ చన్ను పాషా





**ముద్ర, కూకట్‌పల్లి :** కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగ చైర్మన్‌గా నూతనంగా నియమితులైన మొహమ్మద్ చన్ను పాషా శుక్రవారం కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ బండి రమేష్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు.కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం శ్రీ హేమ దుర్గా భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో బండి రమేష్ , నూతన చైర్మన్ చన్ను పాషా కి శాలువా కప్పి, స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు లక్ష్మయ్య, నవాజ్, పాషా, అక్బర్, సచిన్, బర్కత్ అలీ, ప్రసన్న కుమార్, అస్లాం, పర్వేజ్, రమణ, ఖాజా, రమాదేవి, స్వరూప పాల్గొన్నారు.

## ఓయూలో బతుకమ్మ వేడుకలు

**ఆర్ట్స్ కాలేజీ ఎదుట విద్యార్థినులతో కలిసి బతుకమ్మ ఆడిన కోమటిరెడ్డి లక్ష్మి**



**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణ ఉద్యమాల పురిటిగడ్డ ఉస్మానియా యూనివర్సిటీలో బతుకమ్మ వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. చారిత్రక ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలకు కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ చైర్‌పర్సన్ కోమటిరెడ్డి లక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థినులతో కలిసి బతుకమ్మ ఆడి సందడి చేశారు.తెలంగాణ ఉద్యమ సమయంలో విద్యార్థులు పిడికిళ్లు బిగించి 'జై తెలంగాణ' అంటూ నినదించిన ఉస్మానియా యూనివర్సిటీ ప్రాంగణంలో, తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొనడం ఎంతో సంతోషాన్నిచ్చిందని కోమటిరెడ్డి లక్ష్మి అన్నారు. తెలంగాణ ఉద్యమంలో బతుకమ్మ ఒక సాంస్కృతిక కెరటంలా నిలిచి, రాష్ట్ర సాధన ఆకాంక్షను నలుదిశలా చాటిందని పేర్కొన్నారు.ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినులు బతుకమ్మ ఆడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ముందుకు తీసుకెళ్లడం అభినందనీయమన్నారు. మన ప్రత్యేక సంస్కృతి పట్ల నేటి తరం విద్యార్థినులకు ఉన్న నిబద్ధతను ఈ వేడుకలు చాటుతున్నాయని, ఇది శుభపరిణామమని ఆమె అన్నారు. తెలంగాణ అస్తిత్వానికి ప్రతీకగా నిలిచిన బతుకమ్మ పండుగను భావితరాలకు అందించడంలో యువత భాగస్వామ్యం కావడం సంతోషకరమని పేర్కొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 10.10.2026
www.mudranews.in | @mudranews



**తడి గుడ్డతో పట్టి వేయడం**

జ్వరం తీవ్రత (ఉష్ణోగ్రత) ఎక్కువగా ఉన్నప్పుడు, సాధారణ/గోరువెచ్చని నీటిలో శుభ్రమైన గుడ్డను ముంచి నుదురు, మెడ మరియు చేతులపై తుడవాలి. ఇది శరీర ఉష్ణోగ్రతను వెంటనే తగ్గించ దానికి సురక్షితమైన సంప్రదాయ పద్ధతి.



## భవిష్యత్ అవసరాలకు తగినట్లు ప్రజా రవాణా...

* ఆధునిక సాంకేతికతకు పెద్ద పీట వేయాలి
* కేబీఆర్ చుట్టూ మరింత సజావుగా రాకపోకలు
* రీసైకిల్డ్ వాటర్ వినియోగంపై పూర్తి స్థాయి అధ్యయనం
* క్యూర్ పరిధిలో పనుల సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**ముద్ర, హైదరాబాద్**: భవిష్యత్ అవసరాలకు తగినట్లు క్యూర్ పరిధిలో ప్రజా రవాణా సదుపాయాలు మెరుగుపర్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. క్యూర్ పరిధిలో ప్రజా రవాణా మెరుగు, వివిధ రహదారుల అనుసంధానత, రీసైకిల్డ్ వాటర్ వినియోగంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శుక్రవారం రాత్రి సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ నగరంలో విపరీతమైన రద్దీ ఉన్న ప్రాంతాల్లో పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ (PRT) సిస్టమ్ ఏర్పాటుకు అవసరమైన అంశాలపై అధికారులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎక్కువ మంది ప్రజలు రవాణా సాగించే ప్రదేశాలతో పాటు వివిధ కర్మాగారాల్లో పని చేసే కార్మికులు, ఉద్యోగులు రాకపోకలు సాగించే ప్రదేశాల నుంచి మెట్రో, ఎంఎంటీఎస్, బస్ స్టేషన్లతో అనుసంధానించేలా పీఆర్టీ ఉండేలా డిజైన్ చేయాలని సీఎం సూచించారు. ప్రపంచంలోని అత్యుత్తమ పీఆర్టీలపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని సీఎం ఆదేశించారు. సాధ్యమైనంత త్వరగా పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందులో ముఖ్యమైన కాలనీల ఎంపిక, అత్యాధునిక సాంకేతికత, నిర్వహణకు పెద్ద పీట వేయాలన్నారు. క్యూర్ పరిధిలో వివిధ ప్రాంతాల మధ్య అనుసంధానత పెరిగేలా, రహదారుల్లో సజావుగా రాకపోకలు సాగించేలా ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కేబీఆర్ పార్క్ చుట్టూ వన్ వేతో రాకపోకలు మరింత సజావుగా సాగేలా తీసుకోవాల్సిన చర్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కేబీఆర్ పార్క్ చుట్టూ వన్ వేకు వివిధ కాలనీలు, రహదారుల నుంచి వచ్చే రహదారులు కలిసే చోటుతో పాటు ఫ్రీ లెఫ్ట్, యూటర్న్ ల విషయంలో తీసుకుంటున్న చర్యలను అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు సూచనలు చేశారు. యూటిలిటీస్ తరలింపును వేగవంతం చేసి పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. నాగార్జున సర్కిల్ నుంచి జూబ్లీ చెక్ పోస్టు వైపు ఫ్లైఓవర్ పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ముంబయి వంటి నగరాల్లో ఏడాదిలోపే పనులు పూర్తవుతున్నాయని, అక్కడి వినియోగిస్తున్న సాంకేతికత, పనుల తీరుపై అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. ప్రారంభించిన పనులు ఏడాదిలోపు పూర్తయ్యేలా చూడాలని సీఎం ఆదేశించారు. హైదరాబాద్–ముంబయి బుల్లెట్ ట్రైన్ మార్గానికి సమాంతరంగా రేడియల్ రోడ్డు నిర్మాణంపై అధ్యయనం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శంకర్‌పల్లి–చేవెళ్ల మధ్య ఇప్పుడు ఉన్న రహదారుల విస్తరణతో పాటు నూతన రోడ్ల నిర్మాణానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు.

రీసైకిల్డ్ వాటర్ వినియోగానికి సంబంధించిన పనులు వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. 500 ఎంఎల్‌డీ రీసైకిల్డ్ వాటర్ వినియోగానికి సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. భారత్ ఫ్యూచర్ సిటీ, చందన్‌వల్లి, ఆలూరులోని డాటా సెంటర్లు, ఇతర పరిశ్రమలు రీసైకిల్డ్ వాటర్ వినియోగించుకునేందుకు వీలుగా పనులు చేపట్టాలని సీఎం ఆదేశించారు. హైరైజ్ బిల్డింగుల నిర్మాణం, ల్యాండ్ స్కేప్స్, పార్కుల్లో రీసైకిల్డ్ వాటర్ వాడేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు.

క్యూర్ చట్టం అమలుకు సంబంధించి హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్లు, హైడ్రా, వాటర్ బోర్డు, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ అధికారులు సమన్వయంతో పని చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్ల కార్యాలయాల పనులు వేగవంతం చేయాలని సీఎం సూచించారు. సమీక్షలో సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ సలహాదారు ఎన్వీఎస్ రెడ్డి, అదనపు మేనేజింగ్ డైరెక్టర్ అజిత్ రెడ్డి, హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్ల కమిషనర్లు ఆర్.వి.కర్ణన్, సృజన, వినయ్ కృష్ణారెడ్డి, వాటర్ బోర్డు ఎండీ అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఫైర్ ఎన్‌వోసీ నిబంధనల్లో ప్రభుత్వం కీలక మార్పులు

**ముద్ర, హైదరాబాద్**: తెలంగాణ ఫైర్ ఎన్‌వోసీ నిబంధనల్లో ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. నివాస అపార్ట్‌మెంట్ల ఎత్తు పరిమితిని 18 నుంచి 24 మీటర్లకు పెంచింది. 24 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తున్న భవనాలకు ఫైర్ టవర్ తప్పనిసరి చేసింది. బేస్‌మెంట్‌లో డీజీ రూముల వెంటిలేషన్‌కు కొత్త వెసులుబాటు కల్పించింది. క్రెడాయ్, నరెడ్కో, బిల్డర్స్ ఫెడరేషన్ ప్రతినిధులతో చర్చల అనంతరం ప్రభుత్వం ఈ నిర్ణయాలు తీసుకుంది. ఈ మేరకు తెలంగాణ అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్‌సింగ్ మాన్ ఉత్తర్వులు జారీ చేశారు. 2026 అక్టోబర్ 7 నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చినట్లు పేర్కొన్నారు. ఫైర్ ఎన్‌వోసీ సరళీకరణ, భవనాల్లో అగ్ని భద్రతా చర్యల అమలే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

## కారు బీభత్సం.. తప్పిన పెను ప్రమాదం

**ముద్ర, కరీంనగర్** : కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో కారు బీభత్సం సృష్టించింది. వరంగల్ రోడ్డు సమీపంలో భారత్ పెట్రోల్ పంపు ఎదుట ఉన్న విద్యుత్ స్తంభంతోపాటు చెట్టును, ఓ హోటల్‌ను ఢీకొని కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఐదుగురు ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. మరోవైపు రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

## నల్ల బ్యాడ్జీలతో కాంగ్రెస్ శ్రేణుల నిరసన

**ముద్ర, కరీంనగర్ :** కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండల కేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ జాతీయ రహదారిపై స్థానిక అంబేడ్కర్ విగ్రహం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ చేపట్టారు. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు తిరుపతి, టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, సింగిల్ విండో ఛైర్మన్లు బసవయ్య, సంపత్, మహేష్, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ తిరుపతి, నాయకులు పద్మ, గట్టు తిరుపతి గౌడ్, ఊకంటి మధుకర్, తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులు, వృద్ధులకు ఏడీఐపీ పథకం కింద ఉచిత సహాయ పరికరాలు

**అర్హులైన ఒక్కరూ మిగలకుండా ప్రతి గ్రామంలో లబ్ధిదారులను గుర్తించాలని అధికారులకు ఆదేశాలు**
**దివ్యాంగులకు వీల్‌చైర్లు, వినికిడి పరికరాలు, ట్రైసైకిళ్లు, వాకింగ్ స్టిక్స్, కళ్లద్దాలు, కృత్రిమ అవయవాలు తదితర పరికరాలు ఉచితంగా పంపిణీ**
**అర్హులైన ప్రతి ఒక్కరికీ పరికరాలు అందేలా చర్యలు తీసుకోవాలి**
**- అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశం**



**ముద్ర, హైదరాబాద్** : హుస్నాబాద్ నియోజకవర్గంలో అర్హులైన దివ్యాంగులు, వృద్ధులకు భారత కృత్రిమ అవయవాల నిర్మాణ సంస్థ సహకారంతో ఏడీఐపీ పథకం కింద ఉచితంగా సహాయ పరికరాలు అందించేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ డా,, బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో సహాయ పరికరాలు అవసరమైన దివ్యాంగులు, వృద్ధులు ఒక్కరు కూడా మిగిలిపోకూడదని మంత్రి స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం ప్రయోజనం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు వీల్‌చైర్లు, వినికిడి పరికరాలు, ట్రైసైకిళ్లు, వాకింగ్ స్టిక్స్, కళ్లద్దాలు, కృత్రిమ అవయవాలు తదితర సహాయ పరికరాలను ఉచితంగా అందించనున్నారు. 80 శాతానికి పైగా వైకల్యం ఉన్న అర్హులకు ఎలక్ట్రిక్ ట్రైసైకిళ్లు అందించేందుకు చర్యలు చేపట్టనున్నారు.

**ప్రతి గ్రామంలో అర్హులను గుర్తించాలి**

అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకునేలా చూడాలని మూడు జిల్లాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ అధికారులను (DWO) మంత్రి ఆదేశించారు. ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్, ఆశా కార్యకర్తల ఆధ్వర్యంలో సహాయ పరికరాలు అవసరమైన వారిని గుర్తించి, ఎవరూ మిస్ కాకుండా దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో డప్పు చాటింపు ద్వారా కూడా విస్తృత ప్రచారం కల్పించి, అర్హులందరికీ ఈ పథకంపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.

**దరఖాస్తుకు అవసరమైన పత్రాలు**

అర్హత కలిగిన వారు UDID కార్డు లేదా సదరం కార్డు, రేషన్ కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రం, దివ్యాంగుల పెన్షన్ కార్డు వంటి పత్రాలతో దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. ఈ నెల 15వ తేదీలోపు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఎంపికైన లబ్ధిదారులకు ఈ నెల 27, 28, 29 తేదీల్లో సహాయ పరికరాలను పంపిణీ చేయనున్నారు.

**మూడు జిల్లాల పరిధిలో ప్రత్యేక పంపిణీ కేంద్రాలు**

హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఏడు మండలాలు మూడు జిల్లాల పరిధిలో ఉన్నందున, లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా వేర్వేరు ప్రాంతాల్లో పంపిణీ కార్యక్రమాలను నిర్వహించాలని మంత్రి సూచించారు.

– సిద్దిపేట జిల్లా: హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాల లబ్ధిదారులకు హుస్నాబాద్ పట్టణంలో.

– హనుమకొండ జిల్లా: భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల లబ్ధిదారులకు ముల్కనూరులో.

– కరీంనగర్ జిల్లా: చిగురుమామిడి, సైదాపూర్ మండలాల లబ్ధిదారులకు అందుబాటులో ఉండే ప్రాంతంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి పరికరాలు పంపిణీ చేయనున్నారు.

సహాయ పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామం నుంచి దివ్యాంగులు, వృద్ధులను ప్రత్యేక బస్సుల ద్వారా పంపిణీ కేంద్రాలకు తీసుకువచ్చేందుకు జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమానికి వచ్చే వారికి భోజన సదుపాయాలతో పాటు ఇతర మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించి, వారికి అవసరమైన సహాయ పరికరాలను అందించడమే లక్ష్యంగా అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ సర్వేశ్వర్ రెడ్డి, మూడు జిల్లాల డీడబ్ల్యూఓలు, రాంగోపాల్ రెడ్డి (అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ డిజేబిలిటీ), రవిశంకర్ (జాయింట్ మేనేజర్, ఈడీపీ), రవికృష్ణ తదితర అధికారులు పాల్గొన్నారు.

## భవాని దీక్ష చేపట్టిన కేంద్ర మంత్రి బండి సంజయ్



**ముద్ర, కరీంనగర్** : కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మహాశక్తి ఆలయంలో శుక్రవారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ భవాని దీక్ష చేపట్టారు. వేద పండితుల ఆశీర్వచనాల మధ్య మాలధారణ గావించి ఎర్రని వస్త్రాలు ధరించి అమ్మవారి దీక్ష చేపట్టారు. ఈరోజు నుంచి 11 రోజులపాటు ఆయన దీక్షలో ఉంటారు. దీక్షాకాలంలో మహాశక్తి ఆలయంలోనే ఉంటూ అమ్మవారి సేవలో తరించనున్నారు.

## హైదరాబాద్‌లో నవంబర్ 19 నుంచి 85వ ఇండియన్ రోడ్ కాంగ్రెస్

**ముద్ర, హైదరాబాద్:** హైదరాబాద్‌లో నవంబర్ 19 నుంచి 22 వరకు హైటెక్స్‌లో 85వ ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (IRC) జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఈ మేరకు శుక్రవారం సచివాలయంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. సుమారు 3,000 మంది ప్రతినిధులు, 400 ఎగ్జిబిషన్ స్టాళ్లతో జరిగే ఈ సదస్సును తెలంగాణ ఖ్యాతిని చాటేలా, గ్లోబల్ సమ్మిట్ స్థాయిలో నిర్వహించాలని ఆదేశించారు.



నవంబర్ 19న జరిగే ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. దేశవ్యాప్తంగా రహదారుల నిర్మాణం, ఆధునిక సాంకేతికత, రోడ్డు భద్రత, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై చర్చలు జరగనున్నాయి. అతిథుల వసతి, రవాణా, ఆతిథ్యం, పర్యాటక ప్రాంతాల సందర్శనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు.

ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో రాష్ట్రంలో రూ.25 వేల కోట్లతో నాణ్యమైన రహదారుల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. రూ.12,073 కోట్లతో హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిని 6+2 లేన్లుగా విస్తరించే పనులను త్వరగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగానికి భూసేకరణ పూర్తయిందని, దక్షిణ భాగాన్ని కూడా చేపట్టాలని కేంద్రాన్ని కోరినట్లు చెప్పారు. అలాగే మన్ననూరు–శ్రీశైలం మధ్య రూ.7,600 కోట్ల అంచనా వ్యయంతో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ సదస్సు ద్వారా తెలంగాణకు జాతీయ స్థాయిలో గుర్తింపు పెరగడంతో పాటు పెట్టుబడులకు కొత్త అవకాశాలు లభిస్తాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

## తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ బృందం యూరప్ స్టడీ టూర్ విజయవంతం

**స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కి నేతలు, అభిమానుల ఘన స్వాగతం**



**ముద్ర, హైదరాబాద్ :** తెలంగాణ శాసనసభ సభాపతి శ్రీ గడ్డం ప్రసాద్ గారు యూరప్ పర్యటన విజయవంతంగా ముగించుకొని హైదరాబాద్ కు చేరుకున్నారు. కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సీపీఏ) ఆధ్వర్యంలో చేపట్టిన స్టడీ టూర్ ను విజయవంతంగా ముగించుకుని శుక్రవారం ఉదయం 9 గంటలకు శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ కు చేరుకున్న స్పీకర్ ప్రసాద్ కుమార్ కి వికారాబాద్ నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో ఘన స్వాగతం పలికారు. యూరప్ పర్యటనలో భాగంగా జర్మనీ, ఆస్ట్రియా, స్విట్జర్లాండ్ దేశాల్లో పలు అధ్యయన కార్యక్రమాల్లో స్పీకర్ బృందం పాల్గొంది. స్టడీ టూర్ లో భాగంగా ఆయా దేశాల పార్లమెంటరీ వ్యవస్థలు, శాసనసభల పనితీరు, ప్రజాస్వామ్య ప్రక్రియలు, చట్టాల రూపకల్పన విధానాలు, శాసనసభల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, చట్టాల రూపకల్పన విధానాలు, ప్రజాప్రతినిధుల బాధ్యతలు వంటి అనేక కీలక అంశాలపై స్పీకర్ బృందం అధ్యయనం చేసింది.తెలంగాణ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల గురించి స్పీకర్ బృందం యూరప్ పర్యటనలో విదేశీ ప్రతినిధులకు, పెట్టుబడిదారులకు వివరించింది. ముఖ్యంగా హైదరాబాద్ అభివృద్ధి, తెలంగాణలో ఉన్న పెట్టుబడి అవకాశాలు, రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు అందిస్తున్న సహాయ, సహకారాలు, భద్రత, పారదర్శక విధానాల గురించి వివరించి, వారిలో భరోసా కల్పించింది. ప్రభుత్వ ఆధ్వర్యంలో అధికారికంగా చేపట్టిన యూరప్ పర్యటన విజయవంతమైందని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. స్పీకర్ తో పాటు తెలంగాణ శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి గారు, శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాష్ గారు, శాసనసభ కార్యదర్శి రెండ్ల తిరుపతి గారు, శాసనమండలి కార్యదర్శి నరసింహాచార్యులు గారు కూడా విదేశీ పర్యటన పూర్తి చేసుకుని, హైదరాబాద్ కు చేరుకున్నారు. వీరందరికీ ఎయిర్ పోర్టులో ఘన స్వాగతం లభించింది. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం, ప్రజాస్వామ్య పరిరక్షణ దిశగా స్పీకర్ ప్రసాద్ కుమార్ చేపట్టే కార్యక్రమాలు మరింత ముందుకు సాగాలని నాయకులు, అభిమానులు ఆకాంక్షించారు.

## కరీంనగర్ కార్పొరేషన్ ను ముట్టడించిన బీఆర్ఎస్ శ్రేణులు

**ముద్ర, కరీంనగర్ :** బతుకమ్మ పండగ ఏర్పాట్లలో నగరపాలక సంస్థ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు శుక్రవారం కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయ ముట్టడికి ప్రయత్నించారు. బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు కార్యాలయం వద్దకు చేరుకుని నిరసన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వానికి, నగరపాలక సంస్థ అధికారులకు, పాలకవర్గానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోలీసులకు, నాయకులకు మధ్య తోపులాట చోటుచేసుకోవడంతో పలువురు కిందపడ్డారు. అనంతరం వారిని అరెస్టు చేసి పోలీస్ ట్రైనింగ్ కాలేజీకి తరలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బతుకమ్మ, దసరా ఇతర పండుగలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లు చేసేదని, కాంగ్రెస్ ప్రభుత్వం పండగలపై నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. పండగ సమీపించిన తర్వాత టెండర్లు నిర్వహించడంతో ఏర్పాట్లలో జాప్యం జరుగుతోందన్నారు. బతుకమ్మ పండుగ ప్రారంభమయ్యే సమయానికి కూడా అవసరమైన ఏర్పాట్లు పూర్తి కాకపోవడం నగరపాలక సంస్థ పనితీరుకు నిదర్శనమని విమర్శించారు. నగరంలో పనిచేయని వీధి దీపాలను వెంటనే మరమ్మతు చేసి, అవసరమైన చోట కొత్త లైట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆడపడుచులు చీకట్లలోనే పండగ నిర్వహించుకునే పరిస్థితి నెలకొందన్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపి మూడు రోజుల్లోగా పండగ ఏర్పాట్లన్నీ పూర్తి చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, మాజీ గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్ , కార్పొరేటర్లు గుగ్గిళ్ల జయశ్రీ, జమ్మూ, యూసుఫ్, నలువాల రవీందర్, గాదె రూపా శ్రీనివాస్, ప్రదీప్ యాదవ్, మాజీ కార్పొరేటర్ గందె మాధవి, మహేష్, జంగిలి ఇలందర్ యాదవ్, ఎడ్ల సరిత అశోక్, సోనూ సింగ్, కర్ర సూర్య శేఖర్, గంటల రేణుక తదితరులు పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 10.10.2026
www.mudranews.in | @mudranews
7
జనరల్ న్యూస్
GENERAL NEWS

**తేలికపాటి, వెచ్చని ఆహారం**



జీర్ణవ్యవస్థ బలహీనంగా ఉంటుంది కాబట్టి అరగ డానికి తేలికగా ఉండే వేడి ఆహార పదార్థాలను (ఉదాహరణకు: గంజి, ఇడ్లీ, పెసరపప్పు కిచిడీ) తీసుకోవాలి. నూనె, కారం మరియు మసాలా పదార్థాలకు దూరంగా ఉండటం శ్రేయస్కరం.

# తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారందరు ఉద్యమకారులే

**శాసనమండలి సభ్యులు ప్రొఫెసర్ కోదండరాం**



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** 1980 నుండి 2014 వరకు దశల వారిగా జరిగిన తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరిని తెలంగాణ ఉద్యమకారులుగా గుర్తిస్తామని శాసనమండలి సభ్యులు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. శుక్రవారం తెలంగాణ ప్రజా ఫ్రంట్ 17 వ ఆవిర్భావం సందర్భంగా తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షులు కాశపాక మహేష్ అధ్యక్షతన జరిగిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంతెన సంజీవరావు తెలంగాణ ప్రజా ఫ్రంట్ జెండా ఆవిష్కరించగా తెలంగాణ ఉద్యమకారులు గాదె యిన్నయ్య, విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు అంబటి నాగయ్య మాట్లాడుతూ నాడు స్వాతంత్ర పోరాటంలో నిజమైన ఉద్యమకారులను విస్మరించి పోరాటంలో లేనివారికి గుర్తింపు ఇచ్చినట్లు తెలంగాణలో జరగకూడదని ప్రభుత్వాన్నికి సూచించారు. కాలయాపన చేయకుండా తొందరలోనే ఉద్యమకారులకు గుర్తింపును అందుకు తగిన ఫలితాలను అందజేస్తూ తెలంగాణలో విద్య వైద్యాన్ని అభివృద్ధి పరచాలని హైదరాబాద్ చుట్టూ ఉన్న బంజరు భూములు అసైన్డ్ భూములు ఇనాము భూములు పోరంబోకు లాంటి లక్షల ఎకరాల భూములు కబ్జాలకు గురైనాయి ఈ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ఈ వేదిక నుండి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శులు కావలి యాదయ్య, పాకాల వెంకన్న, జిల్లా సలహాదారులు బట్టు రామచంద్రయ్య, జిల్లా ఉపాధ్యక్షులు రాపోలు పవన్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి రసాల నరసింహ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రసాల బాలస్వామి, నాటి తెలంగాణ కళా సమితి కళాకారులు గుండమల్ల శ్రీను, సీనియర్ జర్నలిస్టు సామ మల్లారెడ్డి విప్లవ రచయితల సంఘం సభ్యులు చెన్నయ్య పాల్గొన్నారు.

## సంస్కృతి స్కూల్‌లో బతుకమ్మ వేడుకలు



**ముద్ర, దేవరకొండ:** సంస్కృతి స్కూల్ ఆవరణలో తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక ప్రతీక అయిన బతుకమ్మ పండుగ వేడుకలను అత్యంత ఘనంగా, కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు సాంప్రదాయ రంగురంగుల బతుకమ్మలను తీర్చిదిద్ది, పూలతో అలంకరించి పాఠశాల ప్రాంగణంలో బతుకమ్మ చుట్టూ చప్పట్లు కొడుతూ భక్తిశ్రద్ధలతో పాటలు పాడుతూ సందడి చేశారు.ఈ వేడుకల్లో సంస్కృతి స్కూల్ డైరెక్టర్ శ్రీ కట్టా వెంకట్ రెడ్డి, కరెస్పాండెంట్ శ్రీమతి కట్టా శిరీష రెడ్డి, మరియు ప్రిన్సిపల్ శ్రీ సుదర్శన్ రెడ్డి గారు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన తెలంగాణ ఆచార వ్యవహారాలకు ప్రకృతి ఆరాధనకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగ ప్రాముఖ్యతను భావి తరాలకు అందించడం మనందరి బాధ్యత. పిల్లల్లో ఐక్యతను, మన సంస్కృతి పట్ల గౌరవాన్ని పెంపొందించేందుకే పాఠశాలలో ఇలాంటి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నాము" అని తెలిపారు.అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, బతుకమ్మ పాటలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ పండుగను ఆనందోత్సాహాలతో విజయవంతం చేశారు.

## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలు



**ముద్ర, దేవరకొండ:** కొండమల్లేపల్లి పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దసరా నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన గోడపత్రికలు, పుస్తకాలను శుక్రవారం స్థానిక వాసవీమాత లయంలో సంఘం ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 10 నుంచి 20వ తేదీ వరకు జరిగే ఉత్సవాలలో ఆర్యవైశ్య , భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు నీలా లక్ష్మయ్య, రాచమళ్ల ర్సింహ, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఊరె జనార్ధన్, ప్రధాన కార్యదర్శి దాచేపల్లి వెంకటేశ్వర్లు, కోశాధికారి కొత్త వెంకటేశ్వర్లు, పీఏపల్లి మండలాధ్యక్షుడు రామయ్య, వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ కోశాధికారి పాంపాటి శ్రీధర్, సముద్రాల ధనయ్య, వీరమళ్ల వెంకటయ్య, దాచేపల్లి నరేందర్, యాదగిరి, శంకర్, బూరుగు హరి, మంచికంటి జగన్మోహన్, సముద్రాల శేఖర్, దొడ్డి మధు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాలలో అన్ని సేవలు

**జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**




**ముద్ర తినిధి, యాదాద్రి భువనగిరి :** అంగన్వాడీ కేంద్రాలలో అన్ని సేవలు అందుబాటులో ఉన్నాయని ప్రీ స్కూల్ పిల్లలు హాజరు శాతం పెంచాలని జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. శుక్రవారం మహిళా శిశు వికలాంగుల వయో వృద్ధుల సంక్షేమ శాఖ యాదాద్రి భువనగిరి జిల్లా ఆధ్వర్యంలో పోషణ మాసం ముగింపు కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ తంగెళ్లపల్లి శ్రీవాణి రవీందర్, గర్భిణీ స్త్రీలు ప్రభుత్వం నుండి అందించే అన్ని సేవలు అందుకొని మంచి పోషకాహారం తీసుకుంటూ పండంటి బిడ్డలకు జన్మ నివ్వాలని గర్భిణీ స్త్రీలను ఆశీర్వదించారు. గ్రంథాలయ సంస్థల చైర్మెన్ అవేజ్ చిస్తీ మాట్లాడుతూ ప్రభుత్వం హమారా గర్భిణీ హమారా జిమ్మేధర్ గా అంగన్వాడి టీచర్లు పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శ్రీనివాస్, జిల్లా పరిషత్ సీఈఓ శోభారాణి, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ స్వాతి, సుధ, సత్యవతి. సీడీపీఓ లు వెంకటరమణ, నాజీ, పారిజాత పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వంలోనే భూనిర్వాసితులకు సరైన న్యాయం

- ఐదేళ్లవరకు కేవలం ఐదు టిఎంసీలే నింపుతాం
- ఇండ్లు పూర్తయిన అనంతరమే పూర్తి స్థాయిలో నీళ్లు
- లప్పానాయక్ తండా వాసులకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో బీర్ల అయిలయ్య



**ముద్ర, యాదగిరిగుట్ట:** రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ద్వారా మాత్రమే భూ నిర్వాసితులకు సరైన న్యాయం జరుగుతుందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. బస్వాపూర్ రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోయిన యాదగిరిగుట్ట మండలం లప్పా నాయక్ తండా నిర్వాసితులకు పునరావాసం కల్పించడంలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం దాతర్‌పల్లి గ్రామ సమీపంలో శుక్రవారం నిర్వహించిన ఇంటి స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ బస్వాపూర్ రిజర్వాయర్ నిర్మాణం కారణంగా భూములు కోల్పోయిన లప్పా నాయక్ తండా నిర్వాసితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారి సంక్షేమం, పునరావాసానికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతామని తెలిపారు. ప్రాజెక్టుల నిర్మాణంతో ప్రాంతం అభివృద్ధి సాధించడంతో పాటు, ఆ ప్రాజెక్టుల కోసం భూములు త్యాగం చేసిన నిర్వాసిత కుటుంబాలకు తగిన న్యాయం చేయడం, వారికి నివాస వసతి కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. గతంలో నష్టపరిహారం కోసం లప్పనాయక్ తండా వాసులు ఉద్యమిస్తున్న సమయంలో కూడా అన్నదానం పెట్టించి తమ మద్దతు తెలియజేశామని, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాదయాత్రలో భాగంగా మీకు న్యాయం చేస్తామన్న హామీ మేరకు, నష్టపరిహారంతో ఇళ్ల స్థలాలు కూడా ఇవ్వడం జరిగిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారం తీసుకొని ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ప్రత్యేక కోటా ఇస్తామని హామీ ఇచ్చారు. భూములు కోల్పోయిన కుటుంబాలు ఆందోళన చెందకుండా, వారికి భరోసా కల్పించి, గౌరవప్రదమైన జీవనం కొనసాగించేందుకు అవసరమైన పునరావాస చర్యలు చేపట్టడం ముఖ్యమని అన్నారు. లప్ప నాయక్ తండా వాసులకు ఇంటి స్థలాల పట్టాల పంపిణీ చేయడం ద్వారా వారు తమ సొంత ఇంటి నిర్మాణానికి ముందడుగు వేసే అవకాశం కలుగుతుందని తెలిపారు. ఇల్లు ఇవ్వటమే కాకుండా ఈ ప్రాంతాన్ని మినీ బంజారాహిల్స్ లాగా మారుస్తామన్నారు. ఇక్కడ ఇల్లు నిర్మాణం పూర్తి అయ్యాక మాత్రమే తండాలో కాళీ చేయిస్తామని అప్పటివరకూ కేవలం ఐదు టిఎంసీల వరకు మాత్రమే నీటిని నింపుతామని ఐదేళ్ల తర్వాత ఇక్కడ ఇళ్లన్నీ పూర్తియిన తర్వాత 8 టిఎంసీలకు పెంచుతామని హామీ ఇచ్చారు. అదేవిధంగా ఇక్కడ ఇల్లు కట్టుకునే ప్రతీ కుటుంబానికి బీర్ల ఫౌండేషన్ తరపున 200 బస్తాల సిమెంటును ఉచితంగా అందజేస్తానని తండా ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ జిల్లా అధికారులు, తహసిల్దార్ గణేష్ నాయక్, యాదగిరిగుట్ట పిఏసిఎస్ చైర్మన్ చీర శ్రీశైలం, లప్పానాయక్ తండా, దాతారుపల్లి సర్పంచులు, వార్డు మెంబర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# ఎఫ్ఎమ్‌జీ హౌస్ సర్జన్స్ స్టైపెండ్ సమస్యలను పరిష్కరించాలి



**ముద్ర, యాదగిరిగుట్ట:** భువనగిరి జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (GGH) లో ఇంటర్న్‌షిప్ చేస్తున్న ఫారెన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్ (FMGs) హౌస్ సర్జన్స్ తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతిని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసి వినతిపత్రం అందజేశారు. గత కొంతకాలంగా తాము ఎదుర్కొంటున్న స్టైపెండ్ (Stipend) బకాయిల సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము భువనగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు నిరంతరం సేవలందిస్తున్నప్పటికీ, తమకు రావలసిన నెలసరి స్టైపెండ్ నేషనల్ మెడికల్ కౌన్సిల్ ప్రకారంగా రూ. 29,792/- కు బదులుగా కేవలం రూ. 5,000/- మాత్రమే ఇస్తామంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ రూ. 5,000/- ను కూడా ఇంటర్న్‌షిప్ మొదలై నాలుగు నెలలు ముగుస్తున్నా ఇంతవరకు ఒక్క పైసా కూడా చెల్లించలేదని కలెక్టర్‌కు వివరించారు. దీనివల్ల నిత్యావసరాలు, వసతి, ఇతర ఖర్చులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తంచేస్తూ, తమకు రావాల్సిన రూ. 29,792/- పూర్తి స్టైపెండ్‌ను క్రమబద్ధంగా విడుదలయ్యేలా చూడాలని కోరారు. హౌస్ సర్జన్స్ సమస్యలపై సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్, ఈ విషయమై సంబంధిత అధికారులతో మాట్లాడి, స్టైపెండ్ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భువనగిరి GGH లో ఇంటర్న్‌షిప్ చేస్తున్న హౌస్ సర్జన్స్ డా.భానుప్రసాద్, డా.ప్రణీత్ రాహుల్, డా.జయంత్, డా.నవీన్ కుమార్, డా.రుషికేష్, డా.సూర్యకిరణ్, డా.మేఘన, డా.ఐశ్వర్య, డా.శ్రీజ, డా.భవిత పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు తుర్కపల్లి విద్యార్థినులు



**ముద్ర, తుర్కపల్లి:** రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు తుర్కపల్లి మండలంలోని మోడల్ స్కూల్ విద్యార్థినులు ఎంపిక కావడం అభినందనీయమని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) బిక్షపతి అన్నారు.ఆలేరు మండలంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన తుర్కపల్లి మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలకు చెందిన బానోతు అమూల్య, గొడుగు బాష్విని జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థినులను ఎంఈఓ మంజూషా రాణి, కళాశాల ప్రిన్సిపల్ అంబటి శోభారాణి, ఫిజికల్ డైరెక్టర్ పల్లె రమేష్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.తెలంగాణ రాష్ట్రస్థాయి బాలబాలికల కబడ్డీ పోటీలు ఖమ్మం జిల్లాలోని కొత్తగూడెంలో అక్టోబర్ 10 నుంచి 13 వరకు జరగనున్నాయి. ఈ పోటీల్లో ఎంపికైన విద్యార్థినులు జిల్లా జట్టు తరపున పాల్గొననున్నారు.విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీల్లోనూ తమ ప్రతిభను చాటుకుని విజయం సాధించాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.

## ఇందిరమ్మ ఇళ్ల అమలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 9 :** ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో అధికారులు పూర్తి బాధ్యతతో పనిచేస్తూ, అర్హులైన లబ్ధిదారులందరికీ పథకం ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్ కుమార్‌లతో కలసి గృహ నిర్మాణ శాఖ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. మండల స్థాయిలో ఎంపీడీవోలే ఈ పథకానికి పూర్తి బాధ్యత వహించాలని, హౌసింగ్ ఏఈలతో సమన్వయం చేసుకుంటూ నివేదికలు స్పష్టమైన ఆధారాలతో సమర్పించాలని తెలిపారు. క్షేత్రస్థాయి పరిశీలనలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.భూమి పత్రాలు లేవనే కారణంతో అర్హులైన లబ్ధిదారుల దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు. స్థానిక పంచాయతీ, రెవెన్యూ అధికారులతో మాట్లాడి నిబంధనల ప్రకారం విద్యుత్ బిల్లులు, ఇతర ఆధారాలను సరిచూసి ఎల్-2, ఎల్-3, ఎల్-0, కొత్త దరఖాస్తుదారులను అర్హతను బట్టి ఎల్-1 జాబితాలోకి చేర్చాలని సూచించారు. గెజిటెడ్ అధికారుల పరిశీలన అనంతరం లబ్ధిదారుల వివరాలను స్పష్టమైన నివేదికలతో కలెక్టర్ లాగిన్‌కు పంపాలని ఆదేశించారు. అలాగే ఇళ్ల నిర్మాణంలో స్లాబ్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, బేస్‌మెంట్ పూర్తయినా పనులు ప్రారంభించని వారికి నోటీసులు జారీ చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో అధికార దుర్వినియోగం



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 9 :** ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో తీవ్ర స్థాయిలో అధికార దుర్వినియోగం, రాజకీయ వివక్ష జరుగుతున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఆరోపించారు. సుందరయ్య భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన కాంగ్రెసేతర సర్పంచులు, ఇందిరమ్మ కమిటీలు నిబంధనల ప్రకారం తయారు చేసిన అర్హుల జాబితాలను పక్కనబెట్టి, కేవలం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకే ప్రాధాన్యం ఇస్తున్నారని మండిపడ్డారు. అత్యంత నిరుపేదలైన ఎల్-1 కేటగిరీ బాధితులకు ఇళ్లు ఇవ్వకుండా, రాజకీయ ఒత్తిళ్లతో ఎల్-2, ఎల్-3 లో ఉన్నవారికి కట్టబెట్టడం సరికాదన్నారు. ప్రజాధనంతో అమలు చేసే సంక్షేమ పథకాల్లో పారదర్శకత లోపించడం దారుణమని, గత ప్రభుత్వ హయాంలో లాగా గ్రామసభలు నిర్వహించి లాటరీ పద్ధతి ద్వారా అర్హులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న అధికారులపై, ప్రభుత్వ వైఖరిపై త్వరలోనే కలెక్టర్‌కు ఆధారాలతో సహా ఫిర్యాదు చేస్తామని తెలిపారు. బాధితులకు న్యాయం జరగకపోతే జిల్లా వ్యాప్తంగా ప్రజా ఉద్యమాలు చేపట్టడంతో పాటు కోర్టును ఆశ్రయించి న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు బండి రమేష్, యర్రా శ్రీనివాసరావు, భూక్యా వీరభద్రం, మాదినేని రమేష్, వై. విక్రమ్ పాల్గొన్నారు.

## బతుకమ్మ పండుగ తెలంగాణ అస్తిత్వానికి వేదిక



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 9 :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ ప్రకృతి ఆరాధనకు, జీవనాధారమైన ప్రకృతి వైభవానికి ప్రతిరూపమని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తెలిపారు. శనివారం నుంచి ప్రారంభం కానున్న బతుకమ్మ సంబరాల సందర్భంగా ఆయన ప్రజలకు శుభాకాంక్షలు అందించారు. ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషించిందని, సమస్త ప్రజల ఆకాంక్షలకు వేదికగా నిలిచిందని పేర్కొన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో బతుకమ్మను రాష్ట్ర పండుగగా గుర్తించి ఘనంగా నిర్వహించడమే కాకుండా ఆడపడుచులకు చీరలు పంపిణీ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పండుగకు ప్రభుత్వ ప్రోత్సాహం తగ్గడం పట్ల ప్రజల్లో అసంతృప్తి ఉందని, తెలంగాణ అస్తిత్వ పండుగల పట్ల ఉదాసీనత తగదని విమర్శించారు. ఆడపడుచులందరూ తొమ్మిది రోజుల పాటు ఆనందోత్సాహాల మధ్య ఈ వేడుకలను ఘనంగా జరుపుకోవాలని ఆయన కోరారు.

## పెన్షనర్ల సమస్యలు పరిష్కారించకపోతే ఉద్యమం తప్పదు



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబర్ 9:** పెన్షనర్ల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం చూపిస్తున్న వివక్ష తగదని, న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకుంటే ఉద్యమానికి సిద్ధం కావాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పరిశ పుల్లయ్య పిలుపునిచ్చారు. కృషిభవన్ లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యూ హెల్త్ స్కీమ్ ప్రారంభించి ఐదు నెలలైనా ఎలాంటి పురోగతి లేకపోవడం, హెల్త్ కార్డుల జారీలో ఆలస్యం, మంజూరైన డీఏను 33 వాయిదాల్లో ఇవ్వడం, పదవీ విరమణ పొందిన వారి బకాయిల చెల్లింపులో తీవ్రమైన జాప్యం చేయడం దారుణమన్నారు. హెల్త్ కార్డుల్లో తప్పుల సవరణకు ఎడిట్ ఆప్షన్ ఇవ్వకపోవడంతో వందలాది మంది వయోవృద్ధులు మనోవేదనకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెన్షనర్ల సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి హెల్త్ కార్డులు, వైద్య సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. పలువురు విశ్రాంత ఉద్యోగులు నూతనంగా సంఘం సభ్యత్వం తీసుకోగా, నాయకులు మేరి ఏసుపాదం, కనపర్తి వెంకటేశ్వర్లు, గుర్రాల శ్రీనివాసరావు, కృష్ణకుమారి, శరత్ బాబు, రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య పాఠశాలలో బతుకమ్మ సంబరాలు



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** శ్రీ చైతన్య పాఠశాల, మామిళ్లగూడెం శాఖలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తులు ధరించి, రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి వేడుకల్లో పాల్గొన్నారు.తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు, పూల వైభవానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు బతుకమ్మ పాటలు, ఆటలతో సందడి చేస్తూ పండుగ వాతావరణాన్ని మరింత ఉత్సాహభరితంగా మార్చారు.విద్యార్థుల్లో మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందించడంతో పాటు, ప్రకృతిని ప్రేమించడం, సంప్రదాయాలను భావితరాలకు అందించడం ఈ వేడుకల ముఖ్య ఉద్దేశమని పాఠశాల ప్రిన్సిపాల్ ఎం. నీరజ తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ఏజీఎం చేతన్, ప్రిన్సిపాల్ నీరజ, కోఆర్డినేటర్లు, ప్రైమరీ ఇన్‌చార్జ్ కల్యాణి, ప్రీ-ప్రైమరీ ఇన్‌చార్జ్ గీత, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 10.10.2026
www.mudranews.in | @mudranews



## జలుబు, దగ్గుకు దివ్యఔషధం




చల్లని వాతావరణంలో వచ్చే జలుబు, దగ్గు, గొంతు నొప్పి వంటి సమస్యల నుంచి ఉపశమనం పొందడానికి మేక తలకాయ కూర ఒక సంప్రదాయ ఔషధంలా పనిచేస్తుంది. ఇది శరీరానికి మంచి వెచ్చదనాన్ని, శక్తిని అందిస్తుంది.

# విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

### నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
### కలెక్టర్ ఆదర్శ్ సురభి



**ముద్ర, వనపర్తి :** వనపర్తి జిల్లా పెబ్బేరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలోని బీసీ బాలికల వసతి గృహంలో బుధవారం రాత్రి విద్యార్థినులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి శుక్రవారం వసతి గృహాన్ని సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. విద్యార్థినులతో నేరుగా మాట్లాడి భోజనం నాణ్యత, తాగునీరు, వసతి గృహంలో కల్పిస్తున్న సౌకర్యాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు అస్వస్థతకు గురికావడానికి గల కారణాలపై సంబంధిత అధికారులు, విద్యార్థినులను విచారించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ అధికారులు స్పందిస్తూ మొత్తం 22 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురైనట్లు, వారందరినీ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నట్లు కలెక్టర్‌కు వివరించారు. ప్రస్తుతం విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందనీ తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, వసతి గృహంలో బుధవారం రాత్రి చికెన్ తో భోజనం చేసిన అనంతరం కొందరు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. ఈ ఘటనకు ఆహారం కలుషితం కావడం కారణమై ఉండవచ్చని తెలిపారు. అనారోగ్యానికి గురైన విద్యార్థినులకు వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందించడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై విచారణ అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వసతి గృహంలో తాగునీటి శుద్ధి యంత్రానికి సంబంధించిన ఫిల్టర్‌ను వెంటనే మార్చించాలని, పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి పరిశుభ్రతను మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు.విద్యార్థినులకు భోజనం వడ్డించే ముందు సంబంధిత అధికారులు తప్పనిసరిగా ఆహారాన్ని రుచి చూసి, నాణ్యతపై పూర్తి నమ్మకం కలిగిన తర్వాతే వడ్డించాలని కలెక్టర్ సూచించారు. వసతి గృహాల్లో విద్యార్థినుల ఆరోగ్యం, ఆహార నాణ్యత, పరిశుభ్రత విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని స్పష్టం చేశారు. విద్యార్థులకు సురక్షితమైన ఆహారం, స్వచ్ఛమైన తాగునీరు, మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించేలా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. బీసీ సంక్షేమ శాఖ అధికారిని ప్రమీల, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## మగ్గంపై చీర నేసిన కలెక్టర్

### చేనేత కార్మికులను ఆదుకుంటాం చేనేత



**ముద్ర, వనపర్తి :** జిల్లాలో చేనేత రంగ అభివృద్ధికి, చేనేత కార్మికుల సంక్షేమానికి అన్ని విధాలుగా సహకరించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. శుక్రవారం అమరచింత మండల పరిధిలోని చేనేత హ్యాండ్లూమ్ వీవర్స్ ప్రొడ్యూసర్ కంపెనీని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ చీరలు తయారు చేసే విధానాన్ని స్వయంగా పరిశీలించారు. అనంతరం మగ్గంపై కూర్చొని చీర నేసే విధానాన్ని ప్రయత్నించి చూశారు. అక్కడి చేనేత కార్మికులతో మాట్లాడి చీరల తయారీ ప్రక్రియ, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, అవసరాల గురించి తెలుసుకున్నారు. అమరచింత చీరల ప్రత్యేకతను, చేనేత రంగానికి సంబంధించిన ఇతర వివరాలను పరిశ్రమల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. చేనేత కార్మికులకు బ్యాంకుల ద్వారా రుణాలు పొందడంలో ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించి, సులభంగా రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా, చేనేత యూనిట్‌లో ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు రూఫ్ టాప్ సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ, చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం తరఫున అవసరమైన సహకారం అందించేలా కృషి చేస్తామని తెలిపారు. చేనేత కార్మికులకు బ్యాంకుల ద్వారా రుణాలు సులభంగా అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేస్తామని పేర్కొన్నారు. అమరచింత చేనేత ప్రొడ్యూసర్ కంపెనీ యూనిట్‌లో ఎండ వేడిమి నుంచి కార్మికులకు ఉపశమనం కల్పించేందుకు సోలార్ వ్యవస్థ ఏర్పాటు చేసే దిశగా అవకాశాలను పరిగణలోకి తీసుకోవాలని పరిశ్రమల శాఖ సహాయ సంచాలకులను ఆదేశించారు. చేనేత రంగాన్ని ప్రోత్సహిస్తూ, కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. చేనేత శాఖ ఏడి ఇందిర, ఇక్కడ మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మ సంబరాలు



**ముద్ర. కూకట్‌పల్లి:** కూకట్‌పల్లి మండలం షంషీగూడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో బతుకమ్మ పండుగ సంబరాలను శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయురాలు విద్యార్థులతో కలిసి రంగురంగుల పూలతో రమణీయమైన బతుకమ్మలను తయారు చేయించారు.అనంతరం విద్యార్థినులతో కలిసి బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో పాఠశాల ప్రాంగణంలో సందడి చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు మాట్లాడుతూ... విద్యార్థులకు చదువుతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల పూర్తి అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. పిల్లల్లో సాంస్కృతిక చైతన్యాన్ని నింపేందుకు పాఠశాలలో అన్ని పండుగలను ఇదే రీతిలో ఉత్సాహంగా జరుపుతామని ఆమె పేర్కొన్నారు. ఈ వేడుకల్లో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**ముద్ర, యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట పట్టణంలోని పాత గుండ్లపల్లి అంగన్‌వాడీ కేంద్రం -1 లో శుక్రవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ అక్తర్ పిల్లలతో కలిసి రంగురంగుల పువ్వులతో బతుకమ్మ పేర్చి ఆడించారు. ఈ కార్యక్రమంలో ప్రీ స్కూల్ పిల్లలు, టీచర్లు, ఆయా పాల్గొన్నారు.

## ట్యాంక్‌బండ్‌పై బర్త్‌డే వేడుకలు వద్దు

### అర్ధరాత్రి రోడ్లపైకి వచ్చి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు
### యువత, తల్లిదండ్రులకు
### హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్ విజ్ఞప్తి



**ముద్ర, హైదరాబాద్:** పుట్టినరోజు వేడుకల పేరుతో అర్ధరాత్రి వేళల్లో ట్యాంక్‌బండ్, ప్రధాన రహదారులు, చెరువులు, పార్కుల వద్దకు వచ్చి కేక్ కటింగ్‌లు నిర్వహించవద్దని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ యువత, తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. క్షణికానందం కోసం చేసే నిర్లక్ష్యం కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతుందని హెచ్చరించారు.ఇటీవల అర్ధరాత్రి 2 గంటల సమయంలో ట్యాంక్‌బండ్‌పై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదాన్ని ఆయన గుర్తుచేశారు. ఆరేళ్ల చిన్నారి పుట్టినరోజు వేడుక కోసం కుటుంబ సభ్యులు ట్యాంక్‌బండ్‌కు వెళ్లగా, జరిగిన ప్రమాదంలో చిన్నారితో పాటు మరో కుటుంబ సభ్యుడు మృతి చెందడం తీవ్ర విషాదాన్ని మిగిల్చిందన్నారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయిందని పేర్కొన్నారు.ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలుఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసు ఉన్నతాధికారులతో కలిసి ప్రమాద స్థలాన్ని పరిశీలించినట్లు సీపీ తెలిపారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై వివిధ ప్రభుత్వ విభాగాలతో సమీక్ష నిర్వహించినట్లు వెల్లడించారు.పుట్టినరోజు వేడుకలను ఇళ్లలో లేదా సురక్షితమైన ప్రదేశాల్లో జరుపుకోవాలని సూచించారు. అర్ధరాత్రి వేళల్లో రహదారులపై వాహనాల రాకపోకలు తక్కువగా ఉండటంతో కొన్ని వాహనాలు అధిక వేగంతో ప్రయాణిస్తుంటాయని, అలాంటి సమయంలో చిన్నపిల్లలను వెంటబెట్టుకుని రోడ్లపైకి రావడం ప్రమాదకరమని హెచ్చరించారు.నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలుట్యాంక్‌బండ్‌పై ఇలాంటి వేడుకలు నిర్వహించడంపై నిబంధనల ప్రకారం నిషేధం ఉందని, గతంలోనే జీహెచ్ఎంసీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని సజ్జనర్ గుర్తుచేశారు. పోలీసులు నిరంతరం పర్యవేక్షిస్తూ అక్కడికి వచ్చే వారిని వెనక్కి పంపిస్తున్నప్పటికీ, కొందరు తిరిగి వచ్చి వేడుకలు నిర్వహించడం ప్రమాదాలకు దారితీస్తోందన్నారు.క్షణికానందం కోసం అమూల్యమైన ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టుకోవద్దని, ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ట్యాంక్‌బండ్, చెరువులు, ప్రధాన రహదారులు, బహిరంగ ప్రదేశాల్లో అర్ధరాత్రి వేడుకలకు దూరంగా ఉండాలని, పోలీసులకు సహకరించి ప్రమాదాల నివారణకు తోడ్పడాలని సీపీ వీసీ సజ్జనర్ కోరారు.

# భూ కబ్జాదారులకు హైకోర్టు తీర్పు చెంపపెట్టు

### స్టేటస్ కో తెచ్చుకున్న వారిని మందలించిన హైకోర్టు



**ముద్ర, యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట మండలంలోని రామాజీపేట రెవెన్యూలో గల తమ భూమిలోకి అక్రమంగా ప్రవేశించి తప్పుడు డాక్యుమెంట్లతో స్టేటస్ కో తెచ్చుకున్న వారికి వ్యతిరేకంగా హైకోర్టు తీర్పు ఇవ్వడం భూకబ్జాదారులకు చెంపపెట్టు లాంటిదని పెద్ద కందుకూరు గ్రామానికి చెందిన రైతులు కాలె వెంకటేష్, కాలె స్వామిలు తెలిపారు. యాదగిరిగుట్ట పట్టణంలోని తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం పెద్ద కందుకూరు మాజీ సర్పంచ్ బీమగాని రాములు గౌడ్ తో కలిసి వారు మీడియాతో మాట్లాడారు. రైతుల భూమిపై తప్పుడు పత్రాలు సృష్టించి అమ్ముకునేందుకు ప్రయత్నించడంతో పాటు తమను బెదిరిస్తున్న వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. పెద్ద కందుకూరు గ్రామానికి చెందిన ఒక నాయకుడు తమను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తూ తమ ఇళ్లపై దాడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు రామాజీపేట రెవెన్యూ పరిధిలో తమ తాత తండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన భూమిపై ఆ నాయకుడు మరికొందరితో కలిసి గతంలో తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించారని ఆరోపించారు. ఆ డాక్యుమెంట్లతో యాదగిరిగుట్ట సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసులో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రయత్నించారని, కానీ చివరి సమయంలో సబ్ రిజిస్ట్రార్ అవి తప్పుడు పత్రాలని గుర్తించి స్థానిక తహసిలార్ కు, పోలీసులు ఫిర్యాదు చేయడంతో రిజిస్ట్రేషన్ ఆగిపోయిందని తెలిపారు. ఈ విషయంపై తాము పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు తమకు న్యాయం చేయాలని కోరామని, ఈ విషయమై కోర్టుకు వెళ్ళగా ఇటీవల తమకు అనుకూ లంగా తీర్పు వచ్చిందని అన్నారు. తమ భూమికి తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రయత్నించిన పెద్ద కందుకూరు గ్రామానికి చెందిన సదరు నాయకుడు, మరి కొందరిపైన గతంలోనూ అనేక భూ వివాదాల ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. వారు తరచుగా తమ భూమిపైకి రావడంతో పాటు తమ ఇళ్ళమీదికి కూడా వచ్చి బెదిరింపులకు గురి చేస్తున్నారని వారు ఆరోపించారు. న్యాయంగా తమదైన భూమిని అమ్ముకోవాలని రైతులు ప్రయత్నిస్తుండగా ఆ నాయకుడు భూమి కొనుగోలు చేయాలని అనుకునే వారిని సైతం బెదిరింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఈ భూమి కోర్టు కేసులో ఉందని మీరు భూమిని కొనుగోలు చేస్తే భవిష్యత్తు లో తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని కొనుగోలు చేసే వారిని కూడా బెదిరిస్తున్నారని ఆరోపించా రు. కోర్టు కూడా ఆ నాయకుడు సృష్టించిన తప్పుడు డాక్యుమెంట్లపై మందలించిందని న్యాయంగా ఉన్న తమ వైపే కోర్టు తీర్పు తమకు అనుకూలంగా వచ్చిందని వారు వివరించారు. ఇప్పటికైనా అధికారులు వారిపై కఠిన చర్యలు తీసుకొని న్యాయబద్ధంగా ఉన్న తమకు అన్ని విధాలుగా సహకరించాలని కోరారు. వారి వెంట నమిలే నాగేష్, కాల్నే పెద్ద స్వామి, కాల్నే చిన్న స్వామి, గంగాపురం లక్ష్మీ నారాయణ, కాల్నే సతీష్, వెంకటేష్, రాములు తదితరులు ఉన్నారు.

## 12 న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ భూమిపూజ

### ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి తుమ్మల



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 9 :** నగరంలోని అల్లిపురంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మించనున్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ భూమిపూజ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఈ నెల 12న త్రిదండి చిన్నజీయర్ స్వామి చేతుల మీదుగా ఈ భూమిపూజ, శంకుస్థాపన మహోత్సవం జరగనుంది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సిపి సునీల్ దత్, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి మంత్రి భూమిపూజ ప్రాంగణాన్ని, ఏర్పాట్లను పరిశీలించి మీడియా సమావేశంలో మాట్లాడారు.దేవదేవుని ఆశీస్సులతో ఖమ్మంలో స్వామివారి ఆలయ నిర్మాణం చేపడుతుండటం ఎంతో సంతోషకరమని మంత్రి పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నియోజకవర్గమైన కొడంగల్‌తో పాటు ఖమ్మంలోనూ టీటీడీ ఆధ్వర్యంలో ఈ ఆలయాల నిర్మాణం జరుగుతోందని, ఈ ఆలయ నిర్మాణం, నిర్వహణ బాధ్యతలను పూర్తిస్థాయిలో టీటీడీయే చూసుకుంటుందని స్పష్టం చేశారు. వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తిరుమల తరహాలోనే క్యూలైన్లు, బారికేడ్లు, రద్దీ నియంత్రణ చర్యలు తీసుకోవాలని సూచించారు.కార్యక్రమానికి వచ్చే భక్తులందరికీ నాణ్యమైన అన్నప్రసాదం, ప్రసాద వితరణ, తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లను సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని అధికారులకు మంత్రి స్పష్టం చేశారు. నాలుగు వైపుల నుంచి వచ్చే వాహనాల కోసం పార్కింగ్ స్థలాలను గుర్తించి, రూట్ మ్యాప్‌లను పోలీసు శాఖ ద్వారా మీడియాకు అందించి విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ నిరంతరం కొనసాగేలా చూడటంతో పాటు, వైద్య సేవలు, అగ్నిమాపక యంత్రాలు, విద్యుత్ అంతరాయం లేకుండా జనరేటర్లు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. తిరుమలలో అమలయ్యే క్రమశిక్షణ, నిర్వహణ విధానాలే ఖమ్మం ఆలయంలోనూ ఉంటాయని, పార్టీలకతీతంగా భక్తులందరూ ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.ఆలయ నిర్మాణంతో పాటు భూమిపూజ నిర్వహణకు టీటీడీకి జిల్లా యంత్రాంగం తరఫున పూర్తి సహకారం అందిస్తామని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. భక్తుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, ప్రసాద వితరణ కేంద్రాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ వెల్లడించారు. మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ ప్రాంగణంలో పారిశుద్ధ్య పనులు ఇప్పటికే ప్రారంభించామని, పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, టీటీడీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డిపోలో టీఆర్‌పీ ఎన్నికల ప్రచారం



**ముద్ర, యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపోలో శుక్రవారం ఆర్టీసీ ఎన్నికల సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షులు తీన్మార్ మల్లన్న ఆదేశాల మేరకు డిపోలోని డ్రైవర్లు, ఉద్యోగులు, కార్మికులను కలిసి పార్టీ బలపరిచిన అభ్యర్థికి కత్తెర గుర్తుపై ఓటు వేసి గెలిపించాలనీ కోరారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికుల సమస్యలు, హక్కులు, డిమాండ్లపై నాయకులు కార్మికులతో మాట్లాడారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు, వారి సమస్యల పరిష్కారానికి తెలంగాణ రాజ్యాధికార పార్టీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. కార్మికుల సంక్షేమం, హక్కుల సాధనే లక్ష్యంగా పార్టీ ముందుకు సాగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పసల ప్రసన్న, యాదాద్రి జిల్లా మహిళా నాయకురాలు బుద్దుల సునీత, యాదగిరిగుట్ట మండల అధ్యక్షులు శిఖ రమేష్,అడ్డగూడూర్ మండల అధ్యక్షులు డప్పు యాదగిరి,మహిళా జిల్లా కార్యదర్శి పల్లెర్ల, లలిత పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ ముందు నిరసన



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు ) జాతీయ అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది బికాష్ రంజన్ భట్టాచార్య కోల్‌కతాలోని నివాసంపై శుక్రవారం తెల్లవారుజామున దుండగులు దాడి చేసి, కిటికీ అద్దాలను పగులగొట్టి, సీసీటీవీ కెమెరాను ధ్వంసం చేయడాన్ని ప్రజాస్వామ్య పై దాడి అని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఐలు జిల్లా కోశాధికారి బొడ్డు కిషన్ అన్నారు. భువనగిరి బార్ అసోసియేషన్ ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యం పరిరక్షణ కోసం, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈ సీ ) నిరంకుశ చర్యలకు, సార్ ప్రక్రియకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడుతున్న భట్టాచార్యను భయ భ్రాంతులకు గురిచేసేందుకే ఈ దాడి జరిగిందని అన్నారు.బీజేపీ–ఆర్ఎస్ఎస్ మద్దతు ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న దుండగుల ఈ చర్యను ఖండిస్తూ, దాడికి పాల్పడిన వారిని, ప్రేరేపించిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్య క్రమంలో ఐ లు సీనియర్ నాయకులు జిట్ట భాస్కరరెడ్డి, పిడుగు ఐలయ్య, జంగయ్య,మహేష్,కరుణాకర్ పాల్గొన్నారు.

## దశాబ్ది ఉత్సవాలకు బీఆర్ఎస్ సన్నాహాలు



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** నూతన గ్రామపంచాయతీలు, మండలాలు, జిల్లాల ఏర్పాటు జరిగి పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు బీఆర్ఎస్ సన్నాహాలు చేపట్టింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి హాజరైన ఆలేరు మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ విప్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి ఉత్సవాల నిర్వహణపై పలు సూచనలు చేశారు. పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాలను విజయవంతం చేయాలని నాయకులతో చర్చించారు. మాజీ జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు, పార్టీ జిల్లా, మండల పట్టణ కౌన్సిలర్ లు, సర్పంచులు పాల్గొన్నారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555